గొట్టిపాటివారి చరిత్ర
శ్రీకదళీపుర గ్రంథమాల
రాణీ భవానీ దుర్గం
పెదకళ్ళేపల్లి, కృష్ణా జిల్లా.

గ్రంథ సమీక్ష

శ్రీకాకుళక్షేత్ర మహాత్యము

కృష్ణాజిల్లాలో శ్రీకాకుళం ఒకప్పుడు ఆంధ్ర సామ్రాజ్యమునకు ప్రథమ రాజధానీ నగరముగయుండి పురాణేతిహాస ప్రసిద్ధిగాంచి కృష్ణానది యొడ్డునయున్న గ్రామము. ఇచట శ్రీకాకుళేశ్వరస్వామివారి సుప్రసిద్ధ దేవాలయము గలదు. ఈ క్షేత్ర మహాత్యము ఈ గ్రంథమునందు బాగుగ వివరింపబడినది. పురాణేతిహాస సంబంధ విషయములుగల ఈ గ్రంథము ఆస్థికులెల్లరిచే చదువబడదగి యున్నది.

--- (ప్రకృతి జీవన్) మార్చి 1965.

శ్రీకృష్ణానదీ మహాత్యము

ఆంధ్రావనిలో పవిత్రమైనట్టి ఆరోగ్యప్రదమైనట్టి జలములతో కూడిన పుణ్యనదులలో కృష్ణానది ప్రథమ స్థానము నలంకరించి యున్నది. ఈ నది పడమటి కనుమలలో పుట్టి బంగాళాఖాతములో కలియువరకు మైదానములలోనే ప్రవహించి నిర్మల వాయువు సూర్యరశ్మిని గ్రహించి తన జలమును ఆరోగ్యవంతము చేసుకొన్నది. ఈ నది ఒడ్డున అనేక పుణ్యక్షేత్రములు గలవు. నదియొక్క మహాత్యమును తెలుపు చరిత్ర చాల గలదు. ఈ విషయములన్నియు ఈ గ్రంథములో వివరింపబడినవి. ఎల్లరును అందును ముఖ్యముగా కృష్ణానదీ తీరవాసులు చదివి ఆనందించవలసిన గ్రంథము.

--- (ప్రకృతి జీవన్) మార్చి 1965.

గొట్టిపాటివారి చరిత్ర

గొట్టిపాటివారు కమ్మవారు. గడచిన రెండువందల ఏండ్లుగా ఆంధ్రదేశమున పేరెన్నికగన్నది ఈ వంశము. ఈ వంశీయులు నేడు కృష్ణాజిల్లా ఘంటశాల గ్రామమున సాటివారిలో ప్రముఖులై, ప్రసిద్ధులై యున్నారు. పెత్తందారీతోపాటు మున్సబుగిరీగూడ చలాయించుచున్నారు. గుంటూరు, చిత్తూరు, విశాఖపట్టణము జిల్లాలలోగూడ గొట్టిపాటివారు ఉన్నారు. వారును కమ్మవారే. విశాఖపట్టణము జిల్లాలో ఈ యింటి పేరువారు వెలమలుగూడ గలరు.

ప్రస్తుత మీ చిన్ని పొత్తమున దొరికినంతవరకు వివరములను సేకరించి కమ్మకుల మండనులగు గొట్టిపాటివారి వంశ చరిత్రను క్రమబద్ధముగా కూర్చినాము. సహృదయులగు పాఠకలోకమునకిది యామోదయోగ్యమగునని మా యాశయము.

ఇట్లు

గ్రంథకర్త.

౧

గొఱ్ఱెపాటి గురవయ్య షుమారు రెండువందల ఇరువది ఐదు సంవత్సరముల క్రితము కైకలూరు తాలూకా కానుకొలను నుండి ఘంటశాల వచ్చెను. వీరిది పేపాళ (నేపాళ) గోత్రము. వీరు ముగ్గురు సోదరులు. పెద్దాయన స్వగ్రామములోనే యుండెను. రెండవఆయన గుంటూరు జిల్లా పెద్దపులివర్రు దగ్గరనున్న గొరికపూడి వెళ్లెను. మూడవవాడగు గురవయ్య ఘంటశాల వచ్చెను.

గురవయ్యకు ఇద్దరు తోబుట్టువులు ఉండిరి. పెద్దామె వెంకమ్మ. ఆమెను ఆళ్లవారికి ఇచ్చిరి. అచిరకాలముననే యామె భర్త గతించెను. రెండవ తోబుట్టువును దేవరకోట ఇచ్చిరి. తల్లిదండ్రులును, భర్తయును గతించగా వెంకమ్మ చెల్లెలియొద్దకు వెళ్ళియుండగోరి తమ్ముడగు గురవయ్యను వెంటబెట్టుకొని బయలుదేరి ఎలకుర్రులో మకాము పెట్టినది. అచట ఉండగనే గురవయ్యకు పెండ్లి యైనది. అక్కడనుండి దేవరకోట వెళ్లాలని తలంచింది ఆళ్ల వెంకమ్మ. దేవరకోట బురదగా ఉంటుంది, ఘంటశాల బాగుంటుందని తమ్ముడు చెప్పగా వేమూరి పిచ్చయ్యగారి బ్రహ్మయ్యగారు ఇప్పుడున్న ఇంటిపట్టున ప్రవేశించిరి. అప్పటి కరణం ఘంటశాల రాముడుగారితో మాట్లాడి గృహవసతికూడా ఏర్పాటు చేసికొనిరి. తరువాత దేవరకొటనుండి మేనల్లుడు వేమూరి పాపన్ననుకూడా ఘంటశాల తీసుకొనివచ్చిరి. వీరిద్దరు జమీందారుగారి వద్ద భూములను తీసుకొని రైతులకు ఇచ్చేవారు.

తరువాత తన కుమార్తె పేరమ్మను మేనల్లుడగు పాపన్నకిచ్చెను. గొఱ్ఱెపాటివారి చెరువుమీద సత్రమునకు ఉత్తరముగానున్న నుయ్యి ఆమె కట్టించినదే. అందుచేతనే ఇప్పటికిని 'పేరమ్మ నుయ్యి' అని ప్రసిద్ధి. అప్పట్లో ఆవైపు వారందరూ ఆ నూతినీరే వాడుకొనుచుండిరి.

తరువాత గురవయ్య పాపన్న పంచుకొనిరి. ఆళ్ల వెంకమ్మ చెరువు త్రవ్వించెను.

చెరువు, కొంత భూమి ఒక భాగము. మిగతా భూమియంతా ఒక భాగము. భూమి భాగము గురవయ్య తీసుకొనెను. చెరువు, ఇతర భూమి పాపన్నదయ్యెను. అందుచేతనే ఆళ్ల వెంకమ్మ చెరువుకు వేమూరివారు ధర్మకర్తలు అయ్యిరి.

౨

గురవయ్యకు ముత్తయ్య, కృష్ణమ్మ, వెంకటనారాయణ, వెంకట్రామయ్య అను నలుగురు కుమాళ్ళుగలిగిరి. పెద్దవాడగు ముత్తయ్యకు గోపన్న, రామన్న అను ఇద్దరు కుమారులు. గోపన్నకు పాపన్న, రామన్నకు ముత్తయ్యఅను కుమారులు గలరు. పాపన్న-ముత్తయ్యలు పంచుకొనిరి. వీరిలో పెద్దల సంగతి ఏమియు తెలియదు. పాపన్నకు బ్రహ్మన్న, సుబ్బన్న అను కుమారులు గలరు. బ్రహ్మన్నకు గోపాలుడు అను కుమార్డు గలడు. ఈ గోపాలుడుగార్ని అమ్మిగారి గోపాలుడుగారని అనేవారు. ఈయనకు చంద్రయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య అను నలుగురు కుమారులు గలరు. చంద్రయ్యకు వెంకటకృష్ణారావు, సీతారామయ్య, సోమశేఖరరావు, ప్రసాదరావు, గోపాలరావు అను ఐదుగురు కుమారులు గలరు. సుబ్రహ్మణ్యంగార్కి శ్రీకృష్ణమూర్తి, గోపాలకృష్ణయ్య అను కుమారులు, బ్రహ్మయ్య గారికి రాధాకృష్ణ,

గోపాలరావు, శివరామప్రసాద్ అను ముగ్గురు కుమారులు గలరు.
పాపన్న రెండవ కుమారుడు అగు సుబ్బన్నకు పాపన్న అను కుమారుడు, పాపన్నకు బాలకృష్ణమ్మ, రామయ్యఅను ఇరువురు కుమారులు గలిగిరి. బాలకృష్ణమ్మ మంచి వ్యవసాయకుడు, తెలివైనవాడు. ఈ బాలకృష్ణమ్మకు వెంకటసుబ్బయ్య అను కుమారుడు కలడు. రామయ్య యుక్తిపరుడు. బాగా చదువుకున్నవాడు. కొంతకాలం దేశాటనం చేశాడు. రామయ్యకు పాపారావు, సత్యనారాయణ, భాస్కరరావు, నాగేశ్వరరావు, కైలాసపతి అను ఐదుగురు కుమారులు గలరు.
ముత్తయ్యగారి రెండవ కుమారుని సంతతిని ముత్యాలయ్యగారి సంతతి అనుట ఆచారం. రామన్న కుమార్డు ముత్తయ్యకు రామస్వామి అను కుమారుడు కలడు. రామస్వామి చాలా పట్టుదల గలవాడు. వీరయ్య, సుబ్బయ్య, ముత్తయ్య, రత్తయ్య అను కుమారులు గలరు. వీరయ్య పూర్వమే చనిపోయెను. సుబ్బయ్య చాల పట్టుదలగల మనిషి. ఈయనకు రామకృష్ణయ్య అను కుమారుడు గలడు. రత్తయ్య గారికి రామచంద్రరావు, వీరరాఘవయ్య అను కుమార్లు గలరు.

3

గురవయ్య గారి రెండవ కుమార్డు

కృష్ణమ్మగారి తెగ

గురవయ్యగారి రెండవ కుమార్డు కృష్ణమ్మ గారికి సుబ్బయ్య, చెంచయ్య అని ఇద్దరు కుమారులు. వీరిద్దరు ప్రసిద్ధులే. చల్లపల్లి రాజా పెద్ద అంకినీడుగారు జలధీశ్వరాలయములోని నంది ముచ్చటగానుండుట చూచి, దానిని శివగంగాలయములో నుంచుటకు తీసుకొనిపో ప్రయత్నించగా సుబ్బయ్యగారు నడుంకట్టి నన్ను చంపి తీసుకొని వెళ్ళవలసిందని సత్యాగ్రహము చేయగా విడిచిపెట్టి పోయెనందురు. ఈ సుబ్బయ్యగారి కాలములోనే బందరులోని ప్రసిద్ధ వ్యాపారస్తులగు పిళ్లారిసెట్టి వారితో స్నేహం. వారు బోళ్ళపాడులో చెరువు త్రవ్వించారు. పిళ్లారిసెట్టి వారి చెరువని ప్రసిద్ధి. సుబ్బయ్య చింతలతోట వేసెను. మున్సఫీ చేసెను. మంచి తెలివిగలవాడు. ప్రథమ భార్యకు సంతానము లేకపోవుటచేత జమాబందీకి వెళ్ళినప్పుడె ద్వితీయం చేసుకొనెను. ఈమెను మనుమలందరూ “కొత్తవ్వ” అనేవారు. ఆమెకు వెంకటకృష్ణమ్మ కలిగెను.
చెంచయ్య కుమారులకంటే ఈ వెంకటకృష్ణమ్మ చిన్నవాడు కావటం చేత చెంచయ్య మనుమలు “అయ్య” అనేవారు. తరువాతు వారి కొడుకులు “అయ్య తాత” అనేవారు. ఈయనకు అయ్యతాతని ప్రసిద్ధి. అందుచేతనే ఈ కుటుంబం వారిని నేటికిని అయ్యతాత గారి కుటుంబం అంటారు.
అయ్యతాత మంచి అందమైనవాడు. చాలకాలం జీవించెను. చింతలతోట చుట్టూ లోపల తాళ్ళు వేయించెను.
ఈయన కుమార్డు పాపన్న. పాపన్న తండ్రికంటే ముందే చనిపోయెను. పాపన్నకు వీరన్న, వెంకన్న,

వెంకట్రాయులు అను ముగ్గురు కుమార్లు కలిగిరి.

చెంచయ్య, వెంకటకృష్ణమ్మలు 23 కత్తుల భూమిని, 23 గుబ్బములను, పశువులను పంచుకొనిరందురు. వీరన్న తెలివైనవాడు. పొలం వెళ్లేవాడుకాడు. గ్రామ వ్యవహారాలు, కుటుంబ సంగతులు చూస్తూ ఉండేవాడు. ఈయన, రామస్వామి, సుబ్బన్న ఒక పార్టీ. రామస్వామికి హంగుదారులు.

వీరన్నగార్కి రత్తయ్య, వెంకటకృష్ణమ్మ అను కుమారులు గలరు. రత్తయ్య వ్యవసాయకుడు. దూరశ్రవణం కలవాడు. గ్రామంలో అన్ని సంగతులు తెలిసికొనేవాడు, గాని వాటిలో జోక్యం జేసుకొనేవాడు కాదు. భూములు టెంపరరీగా కొనేవాడు. పాటకొస్తే ఆయనదే పైపాట. రత్తయ్య, వెంకటకృష్ణమ్మ లిద్దరు మళ్ళీ పంచుకొన్నంత సంపాదించి, యిద్దరు 40 యకరములను పంచొకొన్నారు. మళ్ళీ మెట్టు భాగస్వాములయ్యారు. ఈ రత్తయ్యగార్కి బాపనయ్య అను కుమార్డు గలడు. ఈయన ప్రథమంలో కాంగ్రెసువాది, అనంతరం ఆచార్య రంగాగారి అనుచరుడయ్యెను. వీరి భార్య మహలక్ష్మమ్మగారు పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు చేసిరి. "స్త్రీల సమస్యలు" అను పుస్తకము వ్రాసినారు. ది 4-4-1953న కృష్ణాజిల్లా మహిళా మహాసభ (ఘంటశాల)కు ఆహ్వానసంఘ అధ్యక్షురాలు. వీరికి చంద్రశేఖరరావు అను కుమార్డుగలడు. ఈయన నిడుమోలు నియోజకవర్గం స్వతంత్ర పార్టీ అధ్యక్షులు. వీరన్నగారి రెండవ కుమార్డు వెంకటకృష్ణమ్మను అయ్యతాత అనేవారు. ఈయన అనారోగ్యవంతుడు. కాని అదృష్టవంతుడు. ఈయనకు వెంకటేశ్వర్లు, వీరరాఘవయ్య, వెంకట్రామయ్య, లక్ష్మీనారాయణ అను నలుగురు కుమారులు గలరు. వెంకటేశ్వర్లుగార్కి లీలాకృష్ణయ్య అను కుమార్డు, వీరరాఘవయ్య గార్కి వెంకటసుబ్బయ్య, బి.ఏ., రాధాకృష్ణయ్య అనుకుమారులు గలరు. లక్ష్మీనారాయణ గార్కి నరసింహారావు, వెంకటకృష్ణమ్మ అను కుమారులు గలరు.

వీరరాఘవయ్యగారి కుమారుడు వెంకటసుబ్బయ్య బి.ఏ., ది 3-9-1935 న జన్మించారు. వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయ పట్టభద్రులు. వీరికి సాహిత్యమునందు, రాజకీయములందు మంచి అభిలాష గలదు. వీరు "వాహిని" "ఆంధ్రకేసరి" "హంస" మొదలగు పత్రికలలో వ్యాసములు వ్రాయుచుండిరి. చక్కని యుపన్యాసకులు. పామర్రు లలితకళాసమితి కోశాధికారి. సాంస్కృతిక కార్యక్రమములలో ఎక్కువగా పాల్గొనుచుందురు. ప్రజారంజకుడు, సాహిత్యపోషకుడు, కళాభిమాని, కరుణార్ద్ర హృదయుడు అయిన శ్రీరాజా యార్లగడ్డ శివరామప్రసాద్ గారిని ఉచితరీతిని మొదటగా సన్మానించినది వీరే. యువకులు, ఉత్సాహవంతులు. వీరికి వీరికి వెంకటకృష్ణారావు అను కుమారుడు గలడు.

పాపన్నగారి రెండవకుమార్డు వెంకన్న కేవలం వ్యవసాయదారుడు. ఆ కాలంలో కమాను (అనగా బండ్లు బాడుగకు తోలుట) వెళ్ళుతూ ఉండేవాడు. అమాయకుడు, పూర్వకాలపు మనిషి. వడ్డీ వ్యాపారంవల్ల సగం భూమి పోయి పది ఎకరములుపైన నిలచింది. ఈయనకు వెంకటసుబ్బయ్య అను కుమార్డు గలడు. ఈ వెంకటసుబ్బయ్యగారు ది 1-6-1898న జన్మించిరి. వీరు, వీరిభార్య కుటుంబమ్మగారు గాంధీగారి సిద్ధాంతముల ననుసరించి బ్రిటిషు ప్రభుత్వమునకు ఎదురు పోరాడినందువల్ల 1930లో జైలుకు వెళ్ళినారు. వెంకటసుబ్బయ్యగార్కి హిందీ, బెంగాలీ భాషలయందు పరిచయం గలదు. వీరు ప్రఖ్యాత రచయిత. సరోజినీదేవి, ఆచార్యరంగా, ప్రజానాయకుడు ప్రకాశం, మన రైతుపెద్ద డాక్టరు

సి.ఆర్. రెడ్డి చరిత్ర, ఘంటశాల చరిత్ర, భట్టుమూర్తి రామరాజభూషణుడా, హంపీపిలుపు, మన జమిందారీలు మొదలగునవి వీరి రచనలు. వీరు వ్రాసిన సరోజినీదేవి జీవితచరిత్రకు ప్రభుత్వము వారిచే పారితోషికము పొందిరి. స్వర్గీయ డాక్టరు సి.ఆర్. రెడ్డి చరిత్ర రచించినందుకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు రెండువేల రూపాలయు ఇచ్చిరి. 1961-62 సం॥రంలో వెలువడిన ఉత్తమ తెలుగుగ్రంథముగా దానిని నిర్ణయించారు.

వీరిని ప్రఖ్యాత రచయితగా ది 18-2-1951న ఘంటశాల గ్రామంలో సమ్మానించిరి. 1954లో ఆచార్య రంగాగారు "కృషిక్ పండిత" అను బిరుదునిచ్చి తెనాలిలో సమ్మానించిరి. వీరు కృష్ణాజిల్లా బోర్డు సభ్యులుగా కొంతకాలం పనిచేసిరి. గ్రామసంఘం సెక్రటరీగాను, శ్రీరామమోహన పుస్తకభాండాగారం ప్రెసిడెంటుగాను పనిచేసిరి. శ్రీరామమోహన పుస్తకభాండాగారంను అభివృద్ధి చేసిరి. గ్రంథాలయోద్యమములో వీరికి ప్రముఖపాత్ర గలదు. వీరు "గ్రంథాలయ సర్వస్వము" అను మాసపత్రిక సంపాదకులలో ఒకరు. వీరికి రాధాకృష్ణ అను కుమారుడు గలదు.

పాపన్నగారి మూడవ కుమార్డు వెంకట్రాయులు మంచి అందమైనవాడు. బలశాలి. తెలివైనవాడు. ధైర్యవంతుడు. బోళ్లపాడు గొల్లలు, పాలేళ్ళు హడలిపోయేవారు ఈయనను చూచి. ఈయన వస్తూఉంటే స్త్రీలు ఎక్కడవారు అక్కడ సర్దుకునేవారు. బాలకృష్ణమ్మగారు ఒకనికి బండకొయ్య వేయిస్తే ఆయనతో చెప్పకుండగానే ఊడగొట్టి తీసుకొనివచ్చెనందురు. ఈయన సాహసపరాక్రమములను గురించి చాలా గాథలు చెప్పేవారు. ఆ కాలంలో ఆయనవద్ద ఆరువందల రూపాయలుండెను. అందరికంటే ప్రయోజకుడు. ఆయన భార్య యశోదమ్మ. అక్కచెల్లెళ్లు బాపతు కొంతభూమి కూడ వచ్చినది. ఆయన వయస్సులోనే పోయాడు. ఆయనకు కృష్ణయ్య, రత్తయ్య అను ఇద్దరు కుమారులు. కృష్ణయ్య తండ్రివంటి రూపసి. బోళావాడు. పార్టీలవల్ల, యితర కారణాలవల్ల ఆస్తి చాలపోయింది. అన్నదమ్ములిద్దరూ చెరిపదేసి యకరములు పంచుకున్నారు. ఈ కృష్ణయ్యగార్కి రామకోటయ్య, సుబ్రహ్మణ్యం, వెంకట్రాయులు, పరమేశ్వరుడు అను నలుగురు కుమాళ్ళు. రామకోటయ్యగార్కి వెంకటకృష్ణయ్య; సుబ్రహ్మణ్యంగార్కి రాధాకృష్ణ; వెంకట్రాయులుగార్కి లీలాకృష్ణయ్య; పరమేశ్వరుడుగార్కి శీతారామయ్య అను కుమార్లు గలరు.

వెంకట్రాయులుగారి రెండవ కుమార్డు రత్తయ్య చాల పట్టుదలగల మనిషి. ఎవరిని లక్ష్యపెట్టనివాడు. మంచి వ్యవసాయకుడు. వీరికి సుబ్రహ్మణయం, సీతారామయ్య, వెంకట్రాయులు, గోపాలకృష్ణయ్య అను నలుగురు కుమారులు గలరు.

౪

## చెంచయ్యగారి తెగ

కృష్ణమ్మగారి రెండవకుమార్డు చెంచయ్య ఆజానుబాహుడు. బహుకాలం జీవించెను (110). అన్న సుబ్బయ్య యుండగా అమాయకుడుగా నుండెడివాడు. కాని అనంతరం తన తెలివితేటలు కనపరచెను. మునసఫీ చేసెను. పెద్ద కుటుంబీకుడు. రోజు ఇర్సగింజలు ఉడికేవి. గొట్టిపాటివారిలో ఈయన సంతతి అధికంగా

వృద్ధిగాంచింది.

చెంచయ్యకు 5గురు కుమారులు. కృష్ణమ్మ పెద్దవాడు. ప్రముఖుడు. గొప్ప భక్తుడు. క్షీరాబ్ధిద్వాదశి చేసేవాడు. జలధీశ్వరాలయమునకు అప్పట్లో ఎఱ్రగుడి అని పేరు. సున్నం చేయించలేదు. ఈయనే సున్నం చేయిం, ప్రహరీ కట్టించి, తలంబరాల మంటపము, జలధీశ్వరాలయము ముందు యజ్ఞశాలకు పెంకుటి భవంతి కట్టించెను. జలధీశ్వరస్వామికి మిద్దెరథం చేయించిరి. దానిపై ఒకవైపున రామరావణ యుద్ధం, మరొకవైపున భారతయుద్ధం ఉండేది. శ్రీమంతు రాజా పెదఅంకినీడుగారు చూచి బాగా ఉన్నదని 20 పుట్ల పలుగులు ఇచ్చెను. ఉప్పెనకు (1864 నవంబరు) ఈ రథం పోయినది. రక్తాక్షినామ సం॥రం కార్తీకమాసం (1813లో) శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి దేవాలయం కట్టించెను. నాటినుండి నేటివరకు ఈయన సంతతివారు మాఘశుద్ధ షష్ఠికి ఆ దేవునికి కళ్యాణము అతివైభవముగా చేయుచున్నారు. ప్రథమదినమున ధ్వజారోహణము, తరువాత జగజ్యోతి వెలిగించుట, సహస్రదీపారాధన, బ్రాహ్మణ సమారాధన, ఊరేగింపు.

పూర్వకాలంలో శిస్తులు వసూలు అయ్యేవికావు. అందువల్ల జమీందారుగారి పేష్కసు చెల్లేదికాదు. శిస్తులు చెల్లించకపోతే పెత్తందారులు ఇచ్చి తర్వాత వసూలు చేసుకొనేవారు. దీనిని "ముస్థకపోళ్ళు" అనేవారు. ఒకసారి పెదఅంకినీడుగారికి 80వేలకు వేమూరి వెంకట్రామయ్య, యీ కృష్ణమ్మ హామీయుండి బందరులోని పిళ్లారిశెట్టి పార్థసారథినాయుడు, గోవిందరాజులనాయుడు, సముద్రాలనాయుడు గార్లవద్ద ఇప్పించారు. ఈ కృష్ణమ్మగార్కి శ్రీరాములు, పట్టయ్య, రామచంద్రుడు, నరసన్న అను నలుగురు కుమారులు గలరు.

పెద్దవాడు శ్రీరాములు బహుకాలం కుటుంబాన్ని సాకినాడు. మంచి భక్తుడు. సుబ్రహ్మణ్యస్వామికి రెండు ఎకరముల భూమిని ఇచ్చెను. మంచివాడని, నిజాయితీదారని పేరుపొందెను. కుటుంబం అంతా ఆయన చెప్పినట్లు నడిచేది. ఆయనకు వెంకట్రాయుడు, రామస్వామి, రంగయ్య అను ముగ్గురు కుమార్లు గలరు. వెంకట్రాయుడు బోళ్ళపాడుకు మునసబు. ఈయన కుమార్డు నరసింహం మునసబు. నిక్కచ్చియైన మనిషి. తన వ్యవసాయం, తన పని తప్ప ఇతరుల జోక్యాలు ఉండేవికావు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి యం-70 సెంట్లు భూమినిచ్చెను. శ్రీరాములుగారి రెండవ కుమార్డు రామస్వామి, రామభజన బాగాచేసేవాడు. ఎల్లప్పుడు కీర్తనలు పాడుతూ ఉండేవాడు. ఈయనకు బసవయ్య అను కుమార్డు గలడు. ఈయన వెంకయ్యగారి కుమార్డు మాధవరాయుడుగార్కి దత్తు ఇవ్వబడెను. శ్రీరాములుగారి మూడవ కుమార్డు రంగయ్య పూర్వాచార పరాయణుడు. షష్ఠియుత్సవానికి వచ్చిన మాలమాదిగలు ఇతర జనంతో కలుస్తారేమోనని కఱ్ఱపుచ్చుకొని తిరిగేవాడు. షష్ఠికి కానుకల దీపంవద్ద ఉండి అల్లరి జరుగకుండ సర్దేవాడు. ఈయనకు సుబ్రహ్మణ్యం, బసవయ్య అను ఇద్దరు కుమారులు గలరు. సుబ్రహ్మణ్యం గార్కి శ్రీరాములు, కృష్ణయ్య, చంద్రరావు అనుకుమారులు గలరు. బసవయ్య బోళ్ళపాడు మునసఫ్ చేయుచున్నారు. ఈయనకు వెంకటరంగారావు, పేరయ్య చౌదరి, నరసింహారావు అను ముగ్గురు కుమారులు గలరు. కృష్ణయ్యగారి రెండవ కుమార్డు పట్టయ్య. చెంచయ్యగారి కుమార్డు నరసన్నగార్కి దత్తత ఇవ్వబడెను. ఈయనకు వెంకటకృష్ణమ్మ, గోపాలుడు అను కుమార్లు కలరు.

కృష్ణమ్మగారి మూడవకుమార్డు రామచంద్రుడుగార్కి పెదసుబ్బయ్య, చినసుబ్బయ్య, వెంకట్రామయ్య అను

ముగ్గురు కుమార్లు. పెదసుబ్బయ్య నిస్సంతుగానే పోయెను. వీరిలో చినసుబ్బయ్య తెలివిగలవాడు. వారికి రామకోటయ్య, రాఘవయ్య, వెంకటనారాయణ, సూర్యనారాయణ అను నలుగురు కుమారులు గలరు. రామకోటయ్యగార్కి వెంకటేశ్వర్లు, రామచంద్రరావు అను ఇద్దరు కుమారులు గలరు. రామచంద్రరావు కొత్తపల్లి పంచాయితీ బోర్డు మెంబరు.

రాఘవయ్యగార్కి రాజగోపాల ప్రసాదరావు అను కుమార్డు గలదు. ఈతనికి పశుపోషణయందు శ్రద్ధగలదు. పశు ప్రదర్శనములలో బహుమతులు పొందెను. చేతిపని అనగా చెందులు అల్లుట వగైరాలు బాగుగా వేయును. వ్యవసాయకుడు. వెంకటనారాయణగార్కి సుదర్శనరావు, రామకోటేశ్వరరావు అను కుమార్లు గలరు.

సూర్యనారాయణగార్కి గోపాలకృష్ణప్రసాద్ అను కుమార్డు గలదు.

రామచంద్రుడుగారి మూడవకుమార్డు వెంకట్రామయ్యగార్కి వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, రామచంద్రుడు అను కుమారులు గలరు. వీరు వ్యవసాయకులు.

వెంకటేశ్వర్లుగార్కి బుల్లియ్య చౌదరి అను కుమారుడు గలదు. వీరు ఘంటశాల పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు.

రామచంద్రుడుగార్కి కుటుంబరావు అను కుమార్డు గలదు.

కృష్ణమ్మగారి నాల్గవ కుమార్డు నరసన్న ప్రయోజకుడు, అదృష్టవంతుడు. బహుకాలం జీవించాడు. చనిపోయేవరకు ఒక్క పన్నుకూడ ఊడలేదు. నరసన్నగారి వెంకయ్య అంటారే మా అబ్బాయే వెంకయ్య అనేవాడు. ఆయనకు వెంకయ్య, లక్ష్మీనారాయణ, వెంకట్రామయ్య, గోపాలకృష్ణమ్మ అను నలుగురు కుమార్లుగలరు. అందులో జ్యేష్ఠుడు వెంకయ్య ప్రయోజకుడు, పెత్తందారు. గొఱ్ఱెపాటివారిలో చాలమంది ఈయన చెప్పినట్లే నడిచేవారు.

బ్రాహ్మణులు, కోమట్లు ఈయనయందు గౌరవమర్యాదలు గలిగియుండేవారు. అట్లాగే వారియెడల ఈయన ప్రవర్తించేవాడు, పద్మసాలీలు, రజకులు, భజంత్రీలు ఈయనయెడల భయభక్తులు గలిగియుండేవారు. గ్రామంలో అధికమయిన పలుగుబడి గలవాడు.

బాలకృష్ణమ్మగారి దగ్గర తర్ఫీదు. ఆయనను రోజూ తలస్తూ ఆయన గొప్పతనం చెప్తుతూ ఉండేవాడు. పల్లెటూరి పెత్తనందారుకు కావలసిన అన్ని హంగులూ ఉన్నవి. అవసరమైతే కఱ్ఱలతో ఎప్పటికప్పుడు రంగంలోకి దుముకు రిజర్వుసేన నుంచుకొనేవాడు. గొఱ్ఱెపాటి రంగన్నగారి కుమార్డు గోపాలకృష్ణయ్య, గొఱ్ఱెపాటి వెంకన్న, దోనేపూడి వెంకట్రాయులు ఈయన పార్టీలోని ప్రముఖులు. నరసన్నగారి పార్టీ అనేవారు.

ఈయనకు ప్రత్యర్థులు వేమూరి రామన్నగారి కుమార్డు వెంకయ్య, పుల్లయ్యగారి రత్తయ్య, కొండపల్లి సుబ్బయ్య వగైరాలు. దీనిని రామన్నగారి పార్టీ అనేవారు. వీరు గోగినేని లక్ష్మాయి వ్యవహారంలోను, వడ్లమూడివారి వ్యవహారంలోను లింగంనుయ్యివద్ద కొట్టుకున్నారు.

ఈయన సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి సున్నం చేయించి, ముఖమండపం కట్టించారు. చాల భక్తిశ్రద్ధలతో స్వామివారి కళ్యాణం చేయించేవాడు. రథోత్సవానికి రథాన్ని పాగోలునుంచి తెప్పించి, ఆ రాత్రి అంతా

దేవుని రథంపై ఉంచి, పెద్ద కోలాహలంగా ఊరేగింపు జరిగేది. జగజ్యోతి రోజున కూచిపూడి వారిచేత నాటకం వేయించేవాడు. తరువాత రథమును చేయించెను. ఈ షష్ఠి యుత్సవానికి చాకలి, మంగళ్లు ఊరకవచ్చి తమతమ పనులు చేసేవారు. పద్మసాలీలందరు మగ్గానికి పావలాచొప్పున యిచ్చేవారు. బ్రాహ్మణ సమారాధన చేయించేవాడు. చుట్టుప్రక్కల గ్రామాలనుండి స్త్రీలు మొక్కుబళ్ళకు చాలమంది వచ్చేవారు.

రామస్వామిగారి అనంతరం ఘంటశాల ప్రముఖులలో ఒకరిని తనసన్నిధానంలో ఉంచుకొనుట అవసరమని అప్పటి జమీందారు శ్రీమంతురాజా మల్లికార్జున ప్రసాద్‌నాయుడు గారు తలంచారు. ఈ వెంకయ్యగారిని పిలిపించుకున్నారు. ఈయన చల్లపల్లిలో రాజాగారి సన్నిధానంలో ఉంటూ రాజాగారి పనిపాటలు కొన్ని చూస్తూ ఉండేవాడు. అక్కడ ఉంటూయున్నను ఆత్మగౌరవానికి భంగంలేకుండా ద్రవ్యార్జన చేసినాడు. భూములను సంపాదించుకొన్నాడు. ఘంటశాల గ్రామ సాముదాయక శ్రేయస్సుకు భంగం కలుగకుండా, వ్యవహారాల్లో సంచరించేవాడు.

జమీందారుగారు ఘంటశాల పార్లమెంటు సంగతులేమిటని అడిగితే గ్రామములో పెద్దల హుందాతనము పెంచేవిధంగా, సమయస్ఫూర్తిగా సమాధానం చెప్పేవాడు. అదుగో ఘంటశాల పార్లమెంటు అని ఒప్పుకుంటున్నాడనే వాడాయన. ఒకరినిమించిన వారొకరు.

ఆ రాజాగారిని గురించి, బాలకృష్ణమ్మగారిని గురించి కథలు, కథలుగా చెప్పుతూ ఉండేవాడు; చాల ప్రయోజకుడు; పంచుకొన్నంత సంపాదించాడు. అధికంగా కుటుంబానికే యిచ్చాడు. గ్రామంలో రాజీఅయిన తరువాత వేమూరి వెంకయ్యగారు ఛైర్మన్, ఈయన వైస్‌ఛైర్మన్‌గా చాలకాలం ఉండిరి. వీరిద్దరిమాట బహుకాలం సాగింది.

మొట్టమొదట ఈయన జాతీయోద్యమానికి వ్యతిరేకి. మనిషి మంచి లౌక్యుడు గనుక అభిప్రాయాన్ని తరువాత మార్చుకొని అన్నిటికి తానేఅని ముందడుగు వేసేవాడు. హరిజన దేవాలయ ప్రవేశానికి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయ ధర్మకర్తగా ఈయన ఈన ఆమోదము (ది 23-11-33) నిచ్చి దేవాలయ ప్రవేశమునకు దోహదము కలుగజేశాడు. గ్రామసంఘానికి 1940-45 సం॥లో అధ్యక్షులుగా నుండి జలధీశ్వరాలయ ముఖమండప నిర్మాణమునకు, బాలకృష్ణమ్మగారు కట్టించిన దాబా ప్రక్కన దాబా కట్టుటకు కారకుడయ్యాడు. ఈయనవంటి కార్యవాది, లౌక్యుడు, సమయస్ఫూర్తిగా మాట్లాడగల చతురుడు అరుదు.

బాలకృష్ణమ్మగారి అనంతరం గ్రామంలో ప్రజావశీకరణ సంపాదించింది ఈయనే. వీరు 1953లో స్వర్గస్థులైరి. వీరికి నరసింహం, వెంకట్రామయ్య, వెంకటేశ్వర్లు అను ముగ్గురు కుమారులు గలరు.

నరసింహంగార్ని 18వ ఏటనే చల్లపల్లి ఎస్టేటులో తండ్రిగారు ప్రవేశపెట్టిరి. అప్పటినుంచి ఎస్టేటులో ఉంటూఉన్నారు. 1934లో పెదకళ్ళేపల్లికి ఏస్టేటు తరపున సముద్దారుగా పంపబడినారు. అప్పటినుండి పెదకళ్ళేపల్లిలో చల్లపల్లి రాజాగారి ప్రతినిధిగా ఉంటూ భూములు సంపాదించుకొని స్థిరపడినారు. కొంతకాలము పెదకళ్ళేపల్లిలో వేంచేసియున్న శ్రీఆంజనేయ స్వామివారి దేవస్థానం ధర్మకర్తగా ఎండోమెంటు బోర్డువారిచే నియమింపబడినారు. వీరికి వెంకట నరసయ్య, పార్థసారధి అను కుమారులు గలరు. వెంకటనరసయ్య ది 20-9-1930 సం॥రంలో జననం. 1949 సం॥రంలో "పశువైద్యాచార్య" కోర్సులో

నుత్తీర్ణులైరి. 1952 "వైద్యరాజ" సన్నదును పొందిరి. కొంతకాలము పెదకళ్ళేపల్లి మణేదారుగా పనిచేసిరి. 1962 సం॥రంలో శ్రీకదళీపుర గ్రంథమాలను స్థాపించిరి. శ్రీమత్కదళీపుర మహాత్యము, మహాశివరాత్రి మహాత్యము, శ్రీకృష్ణానదీ మహాత్యము, శ్రీకాకుళ క్షేత్రమహాత్యము, కోళ్ళ పెంపకము, దేవరకోటసీమ సర్వస్వం అను పుస్తకములు వ్రాసిరి. 1964 సం॥రంలో పెదకళ్ళేపల్లి పంచాయితీ బోర్డు మెంబరుగా ఎన్నికైరి. ది 2-1-1966న అఖిలాంధ్ర గీతారామాయణ ప్రచారక పరిషత్తును స్థాపించిరి. వీరికి వెంకట రత్నప్రసాద్, రామకృష్ణ ప్రసాద్ అను కుమారులు గలరు. పార్థసారధికి రమేష్‌చంద్ర బాబు అను కుమార్డు గలదు. వెంకయ్యగారి రెండవ కుమార్డు వెంకట్రామయ్య వ్యవసాయకుడు. ఈయనకు నాగేశ్వరరావు, బసవేశ్వరరావు బి.వి.ఎస్.సి । ఎ.హెచ్., శ్రీనివాసరావు ఎమ్.బి.బి.ఎస్. అను ముగ్గురు కుమారులు గలరు. నాగేశ్వరరావుకు రవీంద్రబాబు అను కుమార్డు గలదు.

వెంకయ్యగారి మూడవకుమార్డు వెంకటేశ్వర్లు. ఈయన ఘంటశాల పంచాయితీ బోర్డు వైస్‌ప్రెసిడెంటుగా కొంతకాలము పనిచేసెను (1964) ప్రస్తుతం పంచాయితీబోర్డు మెంబరు. గ్రామ ప్రముఖులలో ఒకరు. నరసన్నగారి రెండవ కుమార్డు లక్ష్మీనారాయణ మంచి మాటకారి. అన్న వెంకయ్య మాటకు అడుగు దాటనివాడు. దెబ్బలాటంటే సరదా. "ఎదిరించివచ్చిన వేమూరివారిని తప్పక తలమీద కొట్టినాడను అన్నయ్యా". ఈమాదిరిగా అన్నగారియందు గౌరవము. తనశక్తియుక్తులు తెలిపేటట్లు కీర్తనలు కట్టేవాడు. అన్న వెంకయ్యగారు రాజైతే ఈయన సేనాధిపతి. ఈయనకు సుబ్రహ్మణ్యం అను కుమార్డు కలదు. వీరు వ్యవసాయకులు. వీరికి కోటేశ్వరరావు అను కుమార్డు గలదు.

నరసన్నగారి మూడవ కుమార్డు వెంకట్రామయ్య కుటుంబ వ్యవసాయపు లెక్కలు చూస్తూ ఉండేవాడు. ఈయనకు వెంకటకృష్ణయ్య, వెంకటసుబ్బయ్య అనుకుమారులు గలరు. వెంకటకృష్ణయ్య వ్యవసాయకుడు. ఈయనకు వెంకట నరసింహారావు, దశరథరామయ్య అను ఇరువురు కుమారులు గలరు.

వెంకట్రామయ్యగారి రెండవ కుమార్డు వెంకటసుబ్బయ్య చాలాకాలం ఘంటశాల పంచాయితీ బోర్డు వైస్‌ప్రసిడెంటు చేసెను. ఇప్పటికి వైస్ ప్రెసిడెంటు అనియే అందురు. కాంగ్రెసు అభిమాని.

ఈయనకు వెంకట్రామయ్య అను కుమార్డు గలదు. నరసన్నగారి నాల్గవకుమార్డు గోపాలకృష్ణమ్మ. అంతా తండ్రివంటి వాడు. ఆయన వ్యవసాయమేమో, ఆయనేమో. నరసన్నగారి వలెనే తన పంటపెంపును చూచి మురిసిపోయేవాడు. పరశ్రేయోభిలాషి, బోళావాడు. ఈయనకు వెంకటనారాయణ, వెంకటసుబ్బయ్య, వెంకటనరసయ్య, వెంకటరత్నం అను నలుగురు కుమారులు. వీరు అంతా వ్యవసాయకులు.

వెంకటనారాయణ గార్కి గోపాలకృష్ణయ్య అను కుమార్డు గలదు. వెంకటసుబ్బయ్యగార్కి రామకృష్ణ అను కుమార్డుగలదు.

చెంచయ్యగారి రెండవ కుమార్డు పాపన్న. ఈయన గురించి ఏమీ తెలియదు. ఈయనకు రంగన్న, చినరామన్న, లక్ష్మన్న అని ముగ్గురు కుమారులు.

రంగన్న మంచి నిజాయితీదారనేవారు. ఈయన బాలకృష్ణమ్మకు కుడిభుజంగా ఉండేవాడు. రోజూ సాయంకాలం రంగన్నగారి వీధి అరుగుమీద కూర్చొని బాలకృష్ణమ్మ వేళ్ళేవారు. ఈయన సంతతిని

యాయన పేరుతోనే రంగన్నగారని యిప్పటికి పిలుస్తారు.

వీరంతా బలశాలురు. పౌరుష పరాక్రమవంతులు. పశుపోషణలో ప్రసిద్ధులు. రంగన్నగారికి వెంకట్రాయులు, లక్ష్మీనారాయణ, గోపాలుడు, కోటయ్య అను నలుగురు కుమారులు. వెంకట్రాయులు మంచి బలవంతుడు. ఈయనకు రామస్వామి, గోపాలకృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, పట్టయ్య అను నలుగురు కుమార్లు. రామస్వామి వ్యవహర్త. ఘోటక వ్యాజ్యములో వ్యవహరిస్తూ ఉండగనే పోయెను. రెండవ ఆయన గోపాలకృష్ణయ్య మంచి వడ్డీ వ్యాపారస్తుడు. కుటుంబ మేనేజరు. వెంకయ్యగారి సహచరుడు. చాలాకాలం పంచాయితీబోర్డు సభ్యుడుగాను 1920లో యేర్పడిన ధర్మఘోటక సంఘ ప్రథమాధ్యక్షుడుగాను ఉండెను. బోయిలకట్టవద్ద కట్టిన చప్టాకు ప్రథమ కారకుడు. ఈయనకు వెంకట్రామయ్య, వెంకటేశ్వర్లు అను కుమార్లు గలరు. వీరు వ్యవసాయకులు. వెంకట్రామయ్యగార్కి శీతారామయ్య అను కుమార్డు గలడు. వెంకటేశ్వర్లు గ్రామసంఘములో మెంబరుగా కొంతకాలం చేసెను. వీరికి గోపాలకృష్ణయ్య, దుర్గా ప్రసాదరావు అను కుమారులు గలరు.

వెంకట్రాయులుగారి మూడవ కుమార్డు సుబ్రహ్మణ్యం వ్యవసాయకుడు. వెంకట్రాయులుగారి నాల్గవ కుమార్డు పట్టయ్య పట్టుదల గలవాడు. అన్నగారి అనంతరం పార్టీ నాయకుడుగా ప్రసిద్ధిగాంచాడు. ఈయనకు వెంకట్రాయులు అను కుమార్డు గలడు. పంచాయితీ బోర్డు మెంబరు. వీరికి రంగనాథబాబు, పట్టవర్ధనబాబు, నవనీతకృష్ణ, సురేంద్రబాబు అను కుమార్లు గలరు.

రంగన్నగారి రెండవ కుమార్డు లక్ష్మీనారాయణ మంచి బలశాలి. చెడుగుడులో మంచి నేర్పరి. పార్టీ మనిషి. ఈయనకు వెంకయ్య, సుబ్రహ్మణ్యం, నరసింహం అను ముగ్గురు కుమార్లు. వెంకయ్య జబ్బు శరీరం గలవాడు అగుటచేత పాండురాజు అనేవారు. తెలివిగలవాడు. ఇక్కడ కంపెనీలో హాస్యగాడుగా ఉండేవాడు. సుబ్రహ్మణ్యం గార్కి రంగయ్య, వెంకటేశ్వర్లు బి.ఏ., అను కుమార్లు గలరు. వెంకటేశ్వర్లు బి.ఏ., వాహిని పత్రిక సహాయ సంపాదకుడుగా పనిచేసెను. యుగధర్మ అనే పత్రిక సంపాదకులుగ కొంతకాలం నడిపెను. రంగన్న గారి మూడవ కుమార్డు గోపాలుడు మంచి బలశాలి. మాట్లాడుతూ ఉంటే రంకెలు వేస్తున్నట్లే ఉండేది. ఏమీ చదువు లేదు. కాని మంచి జ్ఞాపకశక్తి కలవాడు. భారత రామాయణ కథలన్నీ తెలుసు. ఈయనకు రత్తయ్య, సుబ్రహ్మణ్యం అని ఇద్దరు కుమార్లు. వయస్సులోనే పోయారు. రత్తయ్యగార్కి శ్రీరంగం, గోపాలరావు అను కుమార్లు గలరు. వ్యవసాయకులు.

రంగన్నగారి నాల్గవ కుమార్డు కోటయ్యగారికి వెంకట్రామయ్య, గోపాలకృష్ణయ్య, నరసింహం అని ముగ్గురు కుమార్లు. వెంకట్రామయ్య మంచి వ్యవసాయకుడు. పట్టుదల గలవాడు. పట్టయ్య, వెంకట్రామయ్యలది ఒకే వయస్సు. ఒనే మాటమీద ఉండేవారు. ఇద్దరు వడ్రంపని కూడ నేర్చుకున్నారు. ఈయనకు సుబ్రహ్మణ్యం, శ్రీరంగం, గోపాలకృష్ణయ్య, రామకృష్ణయ్య అను కుమారులు గలరు. గోపాలకృష్ణయ్య పెదకళ్ళేపల్లిలో ఉంటున్నారు. కోటయ్యగారి రెండవ కుమార్డు గోపాలకృష్ణయ్య మంచివాడనిపించుకొన్నాడు. వీరికి రామకోటేశ్వరరావు, రామమోహనరావు అను కుమార్లు గలరు. వీరు మంత్రిపాలెంలో ఉంటున్నారు. కోటయ్యగారి మూడవ కుమార్డు నరసింహం తెలివైనవాడు.

కాంగ్రెసులో చాలకష్టాలు అనుభవించాడు. లాఠీచార్జీలో చాలదెబ్బలు తిన్నాడు. కాంగ్రెసు భక్తుడు. ఖద్దరు సంఘంలో చాలాకాలం పనిచేశాడు. ఈయన, ఈయన భార్య లక్ష్మీకాంతమ్మ కూడ జైలుకు వెళ్ళారు. వీరికి వీరరాఘవయ్య అను కుమార్డు గలడు.

పాపన్నగారి రెండవ కుమార్డు చినరామన్న. ఈయనకు సూరన్న, శ్రీరాములు, చంద్రయ్య, బాపయ్య, నరసింహం అను కుమాళ్లు. వీరంతా మంచి వ్యవసాయకులే. వీరిలో బాపయ్య తెలివైనవాడు. రామన్నగారి పార్టీలో ప్రముఖుడు. వీరంతా చితికిపోయారు. శ్రీరాములు కుమారుడు చెంచయ్య వ్యవసాయకుడు.

పాపన్నగార్కి రామన్న, లక్ష్మన్న – ఇద్దరు కవలపిల్లలు. లక్ష్మన్నను వెంకయ్యగారు ప్రథమములో సంతానం లేకపోతే పెంచుకున్నారు.

లక్ష్మన్నగార్కి గోపాలుడు, రత్తయ్య, రంగయ్య, వెంకట్రామయ్య, నాగయ్య అను కుమార్లు గలరు. గోపాలుడు బుగ్గమీసాలతో దర్జాగా ఉండేవాడు. రత్తయ్య తతిమ్మా తమ్ములతో తాతగారియూరు మంత్రిపాలెం వెళ్లాడు. అక్కడ పార్టీలలో ఒక ప్రముఖుడుగా ఉండెను. తెలివైనవాడు.

చెంచయ్యగారి మూడవ కుమారుడు వెంకయ్యగారు మునసఫీ చేశాడు. మంచి ఉదారుడు. బంధుప్రేమ, న్యాయదృష్టి కలవాడు. తన మేనల్లుండ్రు కొండపల్లి చిట్టెన్న, రంగన్న, బుజ్జయ్యలను మంత్రిపాలెము నుండి, తిరువూరు తాలూకా బిల్లనపల్లినుండి మరియొుక చెల్లిలి బిడ్డలగు కాపుమాని వారిని తీసుకొని వచ్చెను. వెంకయ్యగారి భార్య నాగమ్మ మంచి తెలివితేటలు గలది. ఈమె సంతతిని నాగమ్మ సంతతి అనేవారు. ఈ వెంకయ్యగారికి బాలకృష్ణమ్మ, శ్రీరాములు, వెంకట్రాయుడు, రామస్వామి, మాధవరాయుడు అని ఐదుగురు కుమారులు గలరు. వీరంతా ప్రముఖులే. పంచపాండవులని ఖ్యాతిగాంచినారు.

౫

## గొట్టిపాటి బాలకృష్ణమ్మగారు 1844–1906

ఒక్కొక్క దేశములో ఒక్కొక్క మహాపురుషుడు జన్మించి ఆ దేశములో అనేకములగు మార్పులు తెచ్చి ఖ్యాతిగాంచినట్లుగనే ఒక్కొక్క గ్రామములో ఒక్కొక్క పురుషుడు పుట్టి అట్టి కార్యమునే చేయును. ఆ శ్రేణికి చెందినవాడే బాలకృష్ణమ్మగారు. వెంకయ్యగారి జ్యేష్ఠపుత్రుడు. తండ్రి యనంతరము మున్సబుగిరీ చేసెను. ఈయన అవలంబించిన ధర్మప్రవృత్తి, సత్యనిర్ణయములో జూపిన సాహసము, ఆర్జించిన పేరు ప్రతిష్ఠలు నేటికిని ఘంటశాల పరువు – ప్రతిష్ఠగల గ్రామంగా పన్నెకెక్కుటకు కారణములైనవి.

ఆయన కాలములో రైతులపక్షమున నిలబడి వీరోచితముగా జమీందారుతో పోరాడి ఆ ప్రాంతాలేగాక యితర ప్రదేశాలలోకూడ కీర్తిగాంచెను. వర్చస్సులోను, వర్తనలోను వేషభాషలలోను ఆయనకాయనే సాటి. ఈయన 18వ ఏటనే గ్రామమునసబు అయ్యెను. గాని ఎన్నడును గడువుదాటి అధికారిని సాగనంపలేదు. ఆయన మూర్తి చూస్తే అందరు ముగ్ధులయ్యేవారు. అధికారులందరు ఆయనకు

ఆకాలములో కుర్చీయిచ్చి గౌరవించేవారు.

ఆయన గొప్ప పండితుడు, వేదాంతి, వ్యవహారదక్షుడు. మంచి మాటకారి, మంచి ఆప్తుడు. ఈయనకు పశ్యులు కానివారు లేరు. దేవరకోట పరగణాలో అధికభాగము ఈయనకు అనుకూలముగా ఉండేది. ప్రతిదినము ఈయనతో సంప్రదించుటకు చుట్టుప్రక్కల గ్రామములనుండి వచ్చుచుండెడివారు.

ఆ కాలములో జమిందారీ జబర్దస్తీలు, అన్యాయాలు, అరికట్టిన ప్రముఖుడు. చల్లపల్లి ఎస్టేటులోని చాకలి, కమ్మరి, కుమ్మరి మొదలగువారి వెట్టినిబాపిన దిట్ట. గంగానమ్మ మొదలగు క్షుద్రదేవతలకు బలులు ఇవ్వటం మానిపించిన మాననీయుడు. బ్రాహ్మణులవలెనే టెంకాయలతోనే పూజలు సల్పించిన పుణ్యపురుషుడు.

1884లో మహలక్ష్మమ్మ కొలువు జరిగినది. అంతకుముందు ప్రతి సంవత్సరము ఒక పెద్ద దున్నపోతు, వందలకొలది గొఱ్ఱెలు, మేకలు, కోళ్ళు బలిఅయ్యేవి. దీనినరికట్టి అహింసాయుతంగా పూజలుసలిపే ఏర్పాటుచేసెను బాలకృష్ణమ్మగారు. ఆయన బోధనవల్లనే బహుకాలం క్రిందటనే ఈ గ్రామములో గ్రామదేవత కొలువు పోయెను.

రామదండు మొదలగువాటిని గ్రామానికి రాకుండా ఆపిన సంస్కర్త.

ఈ గ్రామమధ్యగల జలధీశ్వరాలయపు ముందుండే యజ్ఞశాల ఉప్పెనకు పోగా, పవళింపుసేవకై ఆ కరువు దినములలో కష్టించి కట్టించి తనభక్తి ప్రపత్తులను తెలుపుకొనెను. అది గ్రామానికెంతో శోభిస్తున్నది నేడు.

నాగలికి రెండున్నర రూపాయలు, మగ్గమునకు అర్ధరూపాయి చొప్పున రు.400 (నాలుగువందలు) వసూలుచేసి సర్వజిత్తునామ సంవత్సరమున కట్టించెను. అప్పటిలో కూలి రు. 0–1–6. ఈ పుణ్యకాలములో పెద్ద శ్రీరాములుగారు. ఆయనకు అండదండగా నుండెను. ఆరుమాసములు అక్కడ ఉండి కట్టించారు. ధరలు తగ్గినందున ఎవరూ ధాన్యం అమ్మకపోవటంచేత పేదప్రజలు అల్లాడిపోవు చుండిరి. ఆయన 40 రూపాయిల చొ॥న కొని పుట్టి 36 చొ––న అమ్మించెను. తాను మునసబుననే ధీమాతో ఏపనీ చేసేవాడు కాదు. ఆయావైపు కులపెద్దలను రప్పించి వారితో సంప్రదించి తగాదాలు తీర్చేవాడు.

కమ్మవారితోనే కాదు, దిగువ కులాలవారిని కూడ రప్పించి వారితోకూడ సంప్రదించి వారి సలహాలను పరిష్కరించిన ప్రజాస్వామ్యవాది.

ఇప్పటికికూడ పల్లెటూరు పెత్తందారుల్లు దిగువజాతి వారిని హింసించుట, అగౌరవముగ చూచుట తమ గొప్పతనమునకు గుర్తుగా భావించుచుండ ఆనాటి పెద్దమనుషుల తత్వమెట్లుండెనే వేరే వ్యాఖ్యానం చేయనక్కరలేదు. సాంప్రదాయసిద్ధముగను, సంకుచితముగను ఉండే ఆ కాలములో ఆయన ఎంతో ఉదారంగాను, విశాలహృదయంతోను మెలగెడివాడు.

విశ్వబ్రాహ్మణులను శుభాశుభ సమయములలో నాలుగు గుంజల పందిరి వేయనిచ్చేవారు కాదు. గోడలకు సున్నపు పట్టీలను వేయనిచ్చేవారు కాదు ఆయనకు ముందు పెద్దలు. ఆయన కాలములో అట్టి ఆటంకములు లేకుండా అందరివలెనే వారును అలంకరించుకొనుటకు అంగీకరించెను. ఆ కాలములో

వివాహసమయములలో కొన్ని జాతులను పల్లకీ ఎక్కి ఊరేగనిచ్చెడివారు కాదు పెద్దలు. కులవిచక్షణ గమనించక శక్తి, ఉత్సాహముగల వారందరు ఊరేగింపు చేసుకొనుటకు ఆయన ప్రోత్సహించుటయేగాక, ఎఱుకల జాతిని కూడ 'గోచి'మాని పంచె కట్టుకొనవలసినదని ఆయన అధికముగా హెచ్చరించెడివాడు. అట్టిది ఆయన సంస్కృతి.

ఆయన మర్యాదమన్ననలలో సమస్తకులముల వారికి ఉచితరీతిని చూచెడివాడు. మర్యాదమన్ననలలో ఆయన వనవడే నేటికి నిలిచినది. ఈ గ్రామములో అందుచేతనే ఇతర కులములవారు ఎట్టి ఇబ్బంది సబ్బందులు లేక పట్టణవాస ప్రజలవలె మెలుగుటకు అవకాశముండుటచేతనే పలుగ్రామముల నుండి ఇచ్చటకు వచ్చి సుఖశాంతులతో కాపురము చేయుచున్నారు.

ఆయన ప్రజోపకరములైన పనులు, అభ్యుదయకరములైన సాంప్రదాయములను అలవర్చి ఆదర్శప్రాయుడయ్యెను. ఆయన గుణగణములు నేటికిని వివిధ గ్రామాలవారు చెప్పుకొందురు. ఆయన ఈ గ్రామప్రతిష్ఠకు అభివృద్ధికి అనేకవిధముల ఆధారభూతుడయ్యెను.

ఆయనయందు శ్రీమంతురాజాగారికి ఎట్టివిలువ గలదో తెలియుటకు ఒక సంగతి తెల్పెద! ఇప్పటి రాజాగారి తాతగారు ఎస్టేటు అవిభాజ్యమని ప్రివీకౌన్సిలులో గెల్చి చల్లపల్లి వచ్చినప్పుడు పరగణాలోని పెత్తనదార్లు, ప్రముఖులు, ప్రజలు చల్లపల్లి వెళ్ళిరి సత్కరించుటకు. అప్పుడు బాలకృష్ణమ్మగారు కూడ అరిగెను. ఆ కార్యమైన పిమ్మట ఆయన దగ్గరకు మీ తరఫున ఎందరున్నారో భోజనమునకు రమ్మంటున్నారని అక్కడ ఉద్యోగి వచ్చి ఆయనతో చెప్పెను. నా సంగతికేమి, ఎస్టేటు ప్రముఖులు చాలామంది వచ్చిరి. వారి సంగతేమి ఆలోచించిరి అని ఆయన అడుగగా వారిసంగతి రాజాగారు సెలవివ్వలేదు. తమరొక్కరి సంగతే రాజాగారు తెలుసుకో వలసిందని సెలవిచ్చారని ఆ ఉద్యోగి అనగా నేను, నాతో వచ్చినవారికి ప్రత్యేకవసతి మేమిదివరకే ఏర్పాటు చేసుకొంటిమి అని ఆయన జవాబిచ్చెను. జమీందారుగారి దివాణములలో జరిగే పెండ్లిండ్లకు, వేడుకలకు వెళ్ళుటలోను, అక్కడ భోజన, మజ్జనాదులలోను ఘంటశాలవారు బాలకృష్ణమ్మ వలెనే నేర్పరితనముతో మెలగేవారు.

ఆయన, న్యాయవిషయములో జమీందారులంటే ఎంతమాత్రమును వెనుకాడెడివాడు కాదు. 1864లో ఉప్పెనకు చాలా కలప ఈ గ్రామమునకు బందరునుండి కొట్టికొని రాగా రాజాగారు తమ ఉద్యోగుల ద్వారా అదంతా ఈ గ్రామములోని తమ ఆవరణలోనే వేయించుకొనిరి. బందరు కలప వర్తకులగు తాడేపల్లివారు వచ్చి బాలకృష్ణమ్మతో ఆ కలప తమదేనని, ఇప్పించమని చెప్పుకొనగా ఆయన వారికి తోలిపెట్టించెను. "కలప పోగు చేసేవరకు ఊరుకొని అడగకుండగనే తోలిపెట్టిన ప్రతిష్ఠను పాడుచేసెను బాలకృష్ణమ్మ. మొట్టమొదటనే కాదనకపోయెనా." అని అనెనట జమీందారు గారు. ఆ కరువు సంవత్సరములో గ్రామస్థులకు కొంచము జాస్తీ బాడుగ ఇప్పించి సహాయము చేసెను. ఇటులనే ఎన్నో కలవు ఆయన నిర్భయత్వమును, న్యాయపరాయణతను సూచించునవి.

మరకాల వ్యాజ్యము

పూర్వము శిస్తు రొఖరూపముగ గాక ధాన్యం రూపేణ ఇచ్చెడివారు. దీనినే 'ఆగ్రాం' లేక 'అమానీ' పద్ధతి అనెడివారు. ఈ పద్ధతిలో పండిన పంటలో సగంవంతు జమీందారునకు ఇవ్వవలయును. కాని జమీందారుగారు అప్పటి బజారు ధర ప్రకారము తనవంతు క్రింద డబ్బు తీసుకొనెడివాడు. ఈ అవకాశము పురస్కరించుకొని అధికధనము రైతునుండి గుంజవలెననే దురుద్దేశముతో తక్కువ మరకంతో కొలిపించసాగెను. ఈ అన్యాయమును అరికట్టుటకు బాలకృష్ణమ్మ పరగణా రైతులచే ప్రభుత్వము వారికి 1870లో పిటీషన్లు పెట్టించెను.
ఈ పిటీషను విచారించుటకు కొమ్మూరు వెంకటచలం అనే తహశ్శీల్దారు మోపిదేవి మకామునకు వచ్చెను. అప్పట్లో జమీందారగు అంకినీడుగారు తహశ్శీల్దారు యెదుట కుర్చీలో కూర్చుండియుండుటచే భయభీతులయి రైతులు తమకు జరుగుచున్న అన్యాయమును చెప్పుకొనుటకు ఎవ్వరునూ సాహసించరైరి. అంతట బాలకృష్ణమ్మ ఉత్తరీయము తీసి నడుముకు కట్టి సాక్ష్యము చెఉప్పుటకు సంసిద్ధుడై వచ్చెను. అక్కడనే ఆసీనులైన అంకినీడుగారు 'బాలకృష్ణమ్మా! ముక్కుపచ్చలారలేదు, అబద్ధములాడవద్దని హెచ్చరించెను." యదార్థము తప్ప ఒక్క అబద్ధముకూడ మనవిచేయనని ఆయన సమాధానము చెప్పి రైతులకు జరుగుచున్న అన్యాయమునంతయు ఆ విచారణాధికారి యెదుట పూసగుచ్చినటుల చెప్పెను. ఆయన అనంతరము పరగణాలోని ప్రముఖులందరు కూడ ఆ విషయములో జరుగుచున్న అక్రమమును చెప్పుకొనిరి. వరుసగా రైతులందరిని విచారించిన పిమ్మట "కమ్మవారంటే అందరూ కమ్మవారేనా? ఒక బాలకృష్ణమ్మకే చెల్లును" అని రైతుల కనుకూలముగ చెప్పుచూ శిఖామరకముతో ఇకముందునుంచి కొలిపించవలసినదిగా తీర్పు చెప్పెను. నాటినుంచి శిఖామరకములు కొలతకు వచ్చెను.

పరగణా వ్యాజ్యము

ఆ కాలములో జమీందారులెన్నో అక్రమ రుసుములు వసూలు చేయుచుండెడివారు. జమీందారుగారి ఇష్టదేవతగు మహిషాసురమర్ధని ఉత్సవమునకు అమ్మవారి రుసుమని కత్తికి (17 ఎకరములు) రు. 2లు, బాజాఖర్చుకి రు. 2-8-0 లు, (పెత్తనదార్లకు, ఆటపాటగాళ్ళకు, జమీందారీ ఉద్యోగుల ఖర్చులకు వెట్టీల బేరీజులు రు. 0-7-0, నాయకవాడికి రు. 0-2-7 వసూలు చేసెడివారు. ఈ రుసుములు, తాళ్లశిస్తు అక్రమము చెల్లకూడదని 1873లో గొట్టిపాటి బాలకృష్ణమ్మ, వేమూరి వెంకయ్య (ఘంటశాల పాలెం) కలసి దావావేయుటకు నిర్ణయించుకొని వెంకయ్య పేరుతో దావా దాఖలు చేసిరి. దీనికి పరగణాలో రైతాంగము దగ్గర కత్తివరుసన చందా వసూలు ఏసిరి. దావా హైకోర్టులో రైతులపక్షమే అయ్యెను. అయినప్పటికి తాళ్ళ శిస్తుమాత్రము ఇచ్చుటకును, మిగతా రుసుములు ఇవ్వకుండా ఉండేపద్ధతిని రాజీపడిరి.

దీనికి కారణము రైతులు ఇవ్వవలసిన చందా ఇవ్వకపోవుట, వారిలో ఐకమత్యము లేకపోవుట, వ్యవహరించినవారే నష్టపడుట, దావాదారునకు ఖర్చులక్రింద రు. 300-0-0 లుజమీందారుగారే ఇచ్చుటయేగాక ఇంకా కొంత సహాయము కూడ చేసెను.

## రామన్నపేట వారికి సహాయం

రామన్నపేట అగ్రహారములోని బ్రాహ్మణుల భూములు రాజాగారు స్వాధీనము చేసికొనుచుండగా కొందరు వచ్చి, ఘంటశాల ఎస్టేటుకు తల్లి గ్రామము, మీరు మమ్ములను కాపాడవలెననని బాలకృష్ణమ్మతో చెప్పుకొనిరి. అప్పుడాయన ఈ గ్రామము దగ్గరనే ఉన్న ఘంటశాలపాలెం, దేవరకోట పెద్దలకు కూడ కబురంపి వారి అంగీకారముకూడ పొంది వారివద్ద ఆ భూములు కౌలుకు తీసుకొన్నట్లు లిఖిత యేర్పాటు చేసుకొని ఘంటశాల, ఘంటశాలపాలెం, దేవరకోట గ్రామములనుండి కొంతమంది నూరునాగళ్లు తోలుకొనిపోయి ఆ భూమి దున్ని వచ్చిరి. రాజాగారు ఈ నాగళ్ళు పోయే ప్రదేశము (డొంకలు) ఊడ్పించెను. ఈ డొంకలు అడ్డమువేసుకొని పోయి దున్ని ఊడ్పు వేయించిన పిమ్మట జమీందారుగారు వీరిపై ఏమీ జోక్యము చేసుకొనలేదు. “డొంకలు ఊడిపిస్తే వారాగుతారయ్యా” అనెనట శ్రీమంతురాజా మల్లికార్జున ప్రసాదు నాయుడు గారు. ఈ విధముగ ఆ కాలములో తమ వ్యవహారములు దిద్దుకొనుటేగాక, ఇతరులకు కూడ సహాయము చేసెడివారు ఘంటశాలవారు.
మల్లెలవారికి రాజాగారు బాకీఉండిరి. ఆ బాకీ వసూలు కాదాయె. వారు బాలకృష్ణమ్మతో మాట్లాడగా, నేను సహాయము చేస్తానని చెప్పిరి. అందుపై వారు జమీందారుగారితో విరోధానికి మనమే భయపడుచుండగా అచ్చట రైతులు మనకేమి సహాయం చేయగలరని, మనవల్ల వారికి కష్టములు రావచ్చునని సందేహించిరి. దానిపై బాలకృష్ణమ్మగారు జమీందారుగారికి భయపడేవాడు కాదని, పరగణా అంతా ఆయన స్వాధీనమేయని తెలియవచ్చిన తరువాత జమీందారు గారిపై ‘డిక్రీ’ అమలు జరిపించి చినముత్తేవి భూములను వేలం వేయించగా ఘంటశాలవారు వారితరఫున స్వాధీనము చేసుకొనిరి. ఇట్లాగే తాడేపల్లివారికి రాజాగారు బాకీ ఉండగా చిట్టూరు వగైరా భూములలోని కుప్పలు వేలం వేయించి బాలకృష్ణమ్మగారే వసూలు చేయించిరి.

## బాలకృష్ణమ్మగారి ధర్మనిరతి

ఆ కాలంలో బందరు వైశ్యులు తాడేపల్లివారు గొప్ప వర్తకులు. మంచి పలుకుబడి కలవారు. బాలకృష్ణమ్మగారు తమ కలపనంతా తోలిపెట్టించినందుకు వారు సంతోషపడి ఆయనను సన్మానించుటకు

ఆయనను రావించి విందుచేసి భోజనాలైన తర్వాత ఒక పళ్లెంలో తాంబూలమును, 80 నెంబరు మంచి సన్నని పంచెలు, ఒక బంగారు మొలతాడు సమర్పించారు. ఆయన పంచెలు మాత్రం తీసుకొని ధరించి, మొలత్రాడు నిరాకరించారు. ఆ మొలత్రాడును కూడ తీసుకొనవలసినదిగా వారెంతో ప్రాధేయపడగా, ఈ ధోవతులతో మీరు నన్ను సత్కరించారు. మరొకప్పుడు మిమ్ములను ఈ విధంగా సత్కరించగలను. ఈ బంగారు మొలత్రాడు విలువగల వస్తువు. ఇటువంటి దానితో మరల మిమ్ములను సత్కరించజాలను. అయినా నేను మీకు చేసినదేమున్నది? మీ సొమ్ము మీకు చేర్పించాను అన్నారు. ఈ సంఘటన తాడేపల్లి వారిని బాలకృష్ణమ్మగారికి శాశ్వత స్నేహితులుగ చేసింది.

ఆ కాలంలో డబ్బు పుట్టేది కాదు. జమీందారు రైతులపై అనవసర దావాలు వేసినపుడు రైతులకు తాడేపల్లి వారివద్ద కొందరిచేత నోట్లు వ్రాయించి అప్పు యిప్పించి మళ్ళీ వడ్డీతో సహా జాగ్రత్తగా పంపించేవారు. ఉద్యోగులకు ఎవరికైనా సిఫారసు ఉత్తరాలు కావలిస్తే జమీందారుకు దీటైన ఉజ్జీగా తాడేపల్లి వారిచేత వ్రాయించేవాడు.

చల్లపల్లి రాజాగారు ఒకసారి తాడేపల్లివారిని ఋణం అడిగితే బాలకృష్ణమ్మగారు ఇవ్వమంటే ఇస్తామని చెప్పారు. అటువంటి గౌరవం ఆయనపైన తాడేపల్లివారికి. ఈయన వ్యవహార నైపుణ్యం తెలిపే ఘటనలెన్నో చెప్పవచ్చు.

బాలకృష్ణమ్మగారు మునసబుగా ఉండే రోజులలో ఘంటసాల తారకబ్రహ్మంగారు కరణం. వారిద్దరు ప్రత్యర్థులు. చెరొక పార్టీ. కాని ఇద్దరు మంచి వ్యవహర్తలు. వారిద్దరు కలిసి ఒకసారి బండెక్కి వెళు _న్నారు. అప్పుడు బాలకృష్ణమ్మగారు తారకబ్రహ్మం గారితో ఇట్లు అన్నారట. “గుండేరు దాటుతున్నాం జాగ్రత్త” ఈ హెచ్చరిక అర్ధమేమంటే మనం ఒకరిని ఒకరం చులకనగా ఇతరులవద్ద మాట్లాడితే, మలనలనిద్దరిని చులకనగా చూస్తారని, అందుచేత వారిద్దరు ఇతరులతో మాట్లాడేటప్పుడు చాలా గౌరవంగా మాట్లాడేవారు ఒకరినిగురించి ఒకరు తారకబ్రహ్మంగారిని బాలకృష్ణమ్మగారిని గురించి అడిగితే “బాలకృష్ణమ్మగారా! ఆయన దేవతా విగ్రహానికి తగిన ధర్మమూర్తి. ఎంతో నిరతిగలిగిన ధర్మప్రభువు. ఆయనతో సరిపోయేవారెవరున్నారు!” అనేవారు. తారకబ్రహ్మంగారిని గురించి బాలకృష్ణమ్మగారిని అడిగితే ఇట్లా అనేవారు. “మా కరణంగారా! మంచి లెఖవాడు, చక్కని ముసద్దీ, కలుపుగోలుతనం గల పెద్దమనిషి. రైతుల తలలోని నాలుకవంటివాడు” అనెడివారు. వారి మర్యాదమన్ననలు అటువంటివి.

బందరులో ప్రసిద్ధిగాంచిన పిల్లారిసెట్టివారితో గొట్టిపాటివారికి బహుకాలంనుంచి స్నేహం. అది బాలకథష్ణమ్మగారి కాలంలో అధికమైనది. పిల్లారిసెట్టివారినిబట్టి వారి బంధువులు అయిన కోకావారు స్నేహితులయ్యారు. వారి ఉభయుల ఇండ్లలో శుభాశుభకార్యములకు గొట్టిపాటివారు వెళ్తూ ఉండేవారు 1930 వరకు.

బాలకృష్ణమ్మగారు మంచి పలుకుబడి కలవారు. గొప్ప సంస్కారి. గ్రామమంతా తనదేనని భావించేవారు. గ్రామములో మాట మంచితనంవల్ల ఎంతో గౌరవం గాంచెను. కులమత విచక్షణ లేక అందరిని ఆదరించెడివాడు. ఆయనది ప్రజాస్వామ్యదృష్టి. ఆయనవల్లనే ఘంతశాలకు మంచి పలుకుబడి, ప్రతిష్ఠ

ఏర్పడింది.

ఆయన లౌకిక ప్రజ్ఞావిశేషానికి మరొక ఉదాహరణ. చల్లపల్లి యెస్టేటు అన్నదమ్ముల తగాదాలవల్ల కోర్టు ఆఫ్ వార్డ్సు క్రిందకు వచ్చినందున మేనేజరుగారు వెంద్రి వెంకటచలం పంతులుగారు (సీనియర్ డిప్యూటీ కలెక్టరు) బాలకృష్ణమ్మగారిని చల్లపల్లి పిలిపించుకొని, నేను యెస్టేటు రాజాగారికి అప్పగింత పెట్టి వెళ్తున్నాను. వారికి పరిచయం చేస్తాను, రావలసిందిగా కోరాడు. అందుకాయన పెద్దలు తమ దయ ఉంటే చాలు, తమ దర్శనానికే వచ్చాను. ఎక్కడున్నా ఆశీర్వాదం కావాలి అని సెలవు తీసుకున్నాడు. ఆయనకు ముఖ్య శిష్యుడు, సహచరుడు, పెదతండ్రి కుమారుడగు నరసన్న గారి కుమారుడు వెంకయ్యగారు "వారు కోరినట్లు జమీందారుగారి పరిచయం పొందితే బాగుండేదికదా" అనగా "మనవద్ద శక్తి ఉంటే మనలను రాజాగారే పిలిపించుకుంటారు. మనవద్ద సరుకు లేకపోతే వారు పరిచయం చేసినా ఆయన మనలను లెఖ్ఖగా చూడడు. రాజాగారి పరిచయం కంటే ఆయన పరిచయమే అమూల్యంగా భావించి ఆయన ఆశీర్వాదం కోరాం. ఆయన అందకు సంతోషించాడే కాని అన్యథా భావించలేదుగా?" అన్నాడు.

ఆయన మరణకాలమందు కుమార్డు వెంకటనరసింహానికి ఏమి చెప్పుతావు? అని లడుగగా నా దగ్గర ధనధాన్యములున్నవా అప్పగించుటకు! కావలసినది జనవశీకరణము అన్నాడుట. ఇట్లా ఆయనను గురించి ఎంతైనా వ్రాయవచ్చును. గ్రంథవిస్తరణ భీతిచే వదులుచున్నాను.

౬

బాలకృష్ణమ్మగారికి వెంకటనరసింహం, గోపాలుడు, వెంకట్రామయ్య అని ముగ్గురు కుమాళ్లు. పెద్దాయన మునసముగా నుండి ప్రఖ్యాతిగాంచాడు. తన డ్యూటీలో ఎన్నడును ఏమరేవాడు గాడు. ఓట్ల నిరాకరణలో గ్రామానికి మంచి ప్రతిష్ఠ తెచ్చాడు. 1920లో ఓట్లు ఇవ్వద్దనే రోజులలో గ్రామంలో కాంగ్రెసువాదులగు గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రభృతుల ఫలితంగా, గ్రామమువారును, ఇతర గ్రామాలవారు ఈ పోలింగులో ఒక్క ఓటుకూడా వేయలేదు. ఇక గ్రామోద్యోగులు ఓటు చేయాలా, అక్కర్లేదా? అని ప్రశ్న ఉదయించింది. కొందరు వేద్దామని మరికొందరు వద్దని తర్జనభర్జనలు పడ్డారు. వోటు చేయవద్దని వారినికూడా కాంగ్రెసువారు కోరుచుండిరి. అంతట గొట్టిపాటి బ్రహ్మయ్య, గొట్టిపాటి వెంకటసుబ్బయ్య, వెంకటనరసింహం గారి వద్దకు వెళ్ళి పెదనాయనా మనగ్రామానికి గొప్ప ప్రతిష్ఠ వచ్చే ఈ ముహూర్తాన్ని మనం సరిగా ఉపయోగించుకోవాలి. సాహసించి మీరు ఓటు చేయనని చెప్పితే, గ్రామోద్యోగులెవ్వరూ ఓటు చేయరు అని కోరిన వెంటనే ఆయన గ్రామోద్యోగుల నందరిని ఒక చోటికి చేర్చి గ్రామస్తులందరకు వ్యతిరేకంగా మనం ఓటు చేయడం ఏంన్యాయం! మనలను ఏ డిప్యూటీ కలెక్టరైనా అడిగితే ఇట్లా చెప్పుదాం. మామా గ్రామస్థులు అందరు మమ్ములను ఓటు చేయవద్దన్నారు. ప్రభుత్వం వారు వోటి ఇవ్వమని మాకు సర్క్యులర్ పంపలేదు. ప్రజలను ధిక్కరిస్తే ప్రభుత్వపు అండైనా మాకుంటుందని ఏ అధికారి మాకు హామీ ఇవ్వలేదు. అందువల్ల 'ప్రజాభిప్రాయానికి కట్టుబడ్డాము' అని చెప్పుదాము అని

అన్నారు. ఈ వాదనకు అదివరకే సుముఖంగా ఉన్న కొడాలి గ్రామ మునసబుగారగు 'తుమ్మల సీతారామయ్య' గారు బలపరిచారు. అందరూ సరేనని ఓటు చేయలేదు. అందుచేత ఘంటశాల పోలింగునుండి కాళీ పెట్టెలు వెళ్లెను. దీనివల్ల ఈ జిల్లాలోనే గాక దేశమంతటా ఘంటశాల ప్రతిష్ఠ గాంచినది. కాంగ్రెసుకు పెట్టనికోట అని ప్రఖ్యాతి గాంచినది. ఈ విధంగా బాలకృష్ణమ్మగారి జ్యేష్ఠ పుత్రుడు వెంకటనరిసింహం గారు మరల ఘంటశాల ప్రతిష్టకు కారణభూతుడగుట సంతోషకరము. ఈయనకు లీలాకృష్ణయ్య, రామకృష్ణయ్య, బాలకృష్ణయ్య, రాధాకృష్ణయ్య అను నలుగురు కుమారులు గలరు. లీలాకృష్ణయ్య గ్రామ మునసబు. ఆచార్య రంగాగారి యెడల అభిమానము గలవాడు. చల్లపల్లి రాజాగారికి అనుకూలుడు. బాలకృష్ణమ్మగారి రెండవ కుమారుడు గోపాలుడు. ఈయనకు బాలకృష్ణమ్మ, పుండరీకాక్షుడు అను నిద్దరు కొడుకులు గలరు. బాలకృష్ణమ్మగారి మూడవ కుమారుడు వెంకట్రామయ్య. వీరికి వెంకటేశ్వర్లు అను కుమారుడు కలడు. ఈ వెంకటేశ్వర్లుకు రామకృష్ణయ్య అను కుమారుడు గలడు.

వెంకయ్యగారి రెండవ కుమార్డు శ్రీరాములు మంచి అందగాడు. అన్నగారి యందమితమైన భక్తి గలవాడు. ఆ కాలంలో కమాను తోలి కాస్త సంపాదించి తెచ్చి ఇచ్చేవాడు అన్నగారికి. ఈయనయందు అన్నగారికి మంచి ప్రేమ. అతగాడు నాలుగు రూపాయలు తెస్తేనే మనపని అనేవాడు వృద్ధాప్యంలో. నీరుకావి ధోవతులు, పంగనామాలు ధరించి భారతం ఎప్పుడూ చదువుతూ ఉండేవాడు. యుద్ధపంచకం ఆయనకు చాలా ఇష్టం.

ఈయన కుమారుడు వెంకటకృష్ణమ్మ తెలివి గలవాడు. కొంతకాలం ఆక్టింగు మునసబు చేశాడు. చిన్న మునసబు అని పిలిచేవారు.

ఈయన కుమాళ్ళు రామసుబ్బయ్య, బాలకృష్ణమ్మ, వెంకట్రామయ్య.

రామసుబ్బయ్య కొద్దిగా ఇంగ్లీషు చదివి కొంతకాలం ఆక్టింగు మునసఫి చేశాడు. మంచి వ్యవసాయకుడు. రూపమంతా చినమామ వేమూరి లక్ష్మయ్యగారి మాదిరి. ఈయనకు శివరామకృష్ణ అను కుమార్డు గలడు.

బాలకృష్ణమ్మ చిన్ననాడే తాతగారివద్ద పురాణం చదువుతూ, తెలుగులో మంచి అభ్యాసం అలవరచుకొన్న ప్రజ్ఞాశాలి. బందరులో ఇంగ్లీషు చదువుతూ ఇక్కడకు వచ్చి సర్పదక్షుడై మరణించుట అందరకు విచారం కలిగించింది. మళ్లీ బాలకృష్ణమ్మ అవతరించాడని అందరు అనుకున్నారు. గ్రామానికి పేరు తేగలడని ఆశించారు. ఈయన మరణవార్త గ్రామస్థులనే గాక, సోదర విద్యార్థులను, ఉపాధ్యాయులను దు:ఖసాగరంలో ముంచింది. ఈయన కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి శిష్యుడు. ఈయనయందు ఆయనకు అమిత వాత్సల్యము. ఈయన స్మారకసభకు శ్రీ సత్యనారాయణగారు ఘంటశాలకు వేంచేశారు. వీరవల్లడు అనే గ్రంథాన్ని అంకితమిస్తూ బాలకృష్ణమ్మను గురించి ఇట్లు పలికినారు.

ఘంటశాలకు నీ తాతగారివోలె

నేతవై నీవు పొల్చెడి గీతలేదు
నీకు, నభిమన్యుడేమేలు, నీవుగాని
యోయి! కార్యము తేపన బోయినావు.

పూపమొగ్గ వయస్సున బోవ నిన్ను
నేనుజెప్పెడునందాక నెఱుగలేరు
డొక్కలో దూరితీవు కడున్ శిశుబలె
గుతిలపడియున్న నేనెఱుంగుదుగాని.

ఒక యేలోకములందు నీవరిగితో యో బాబు! నీవున్ భుజం
గక దష్టుండయి పోయినావనిన దు:ఖంబింత నాగుండె మం
టకు క్రొత్తైనది నేడుకూడ నది కృష్ణామండలీరాజ పీ
ఠిక మీకమ్మకులంబునన్ మణివహో! టెక్కెంబునన్ రాలితే.

పితృ సుత భావయుగ్మమున ఖేదముచిత్రము నన్నుగన్న మ
త్పిత వదనంబు నాకనులవ్రేలదు పాతికయేండ్లుకాక, నీ
సుతినివలెన్ జరించుటొకచోద్యము, పాతికదాటి నీ సుధా
కృత వదనంబు కన్నులకు నెత్తిన యారతివోలె నాడెడిన్.

తాను శ్రీపతివ్రతాలోకమాణిక్య
మప్పగారు పోయె నది మొదటిది
బిడ్డవంటినీవు వెడతి విది రెండు
తూగు నాదు జక్మ దు:ఖసమితి.

ఈకథ పాతిక యేండ్లుగ
నీ కంకితమిత్తునంచు నిలిపితి బాబూ!
నీకిదిగొ యంకితంబుగ
నీకథ నాతండ్రిచెప్పె నెంతయు నాకున్.

నీవేమొ రైతుబిడ్డవు
నీవల్లడు మంటిగడ్డ నెగసినవాడున్

మావంశ కథాదీపిక
నీవస్మత్ప్రాణములను నిలుచు శిశువవున్.

కృతియంకితమ్మగొని యె
గతిబోదురు స్వర్గలోక కాంక్షులు నీవా
గతిబొమ్ము మత్సుధా వా
గ్గతి రసమీథీ విహారకల్పకము శిశూ!

--- శ్రీ విశ్వనాథ సత్యనారాయణ.

గురు శిష్యుల ప్రేమకు, గురువుల శిష్యవాత్సల్యమునకు ఇది రమ్యమైన నిదర్శనము గదా!
మూడవవాడగు వెంకట్రామయ్య కొంతకాలం పంచాయతి బోర్డు ఛైర్మన్. గ్రామంలో కొంతకాలం ఒక పార్టీకి నాయకుడు. కమ్యూనిష్టు డిటిన్యూగా కొంతకాలం కారాగారవాసి. నేడు కమ్యూనిష్టు ప్రముఖుడు.
వెంకయ్యగారి మూడవ కుమార్డు వెంకట్రాయుడు. ఈయన అన్న బాలకృష్ణమ్మగార్కి అండగా ఉండేవాడు. గ్రామంలో పెన్నేరమ్మ గ్రామదేవతకు జాతర చేస్తున్నారు. బాలకృష్ణమ్మగారు జాతర్లు వద్దు, బలులు వద్దని. ఈయన అన్నగారికి అనుకూలం చేయదలచి ఆయన చెప్పందే ఆ కొలిచే దేవతను ఎత్తి పందిరిపైన పడవేశాడు. ఈయనకు కృష్ణయ్య, వెంకయ్య అను ఇద్దరు కుమార్లు. ఇద్దరికి పుత్ర సంతానం లేరు. వెంకయ్య సంగీతం కొంత చేర్చుకున్నందున సంగీతపు వెంకయ్య అనే పేరుతో పిలువబడేవాడు.
వెంకయ్యగారి నాల్గవ కుమార్డు రామస్వామి ప్రసిద్ధుడు. బంగారువండి మేనిఛాయపైన గోవా బంగారుత్రాడు కనపడేదే కాడు. చేతికి చేమపువ్వు బంగారు కడియం. ఆయన సహజ సౌందర్యానికి వన్నె తేగా అందరిచే ఆకర్షింపబడేవాడు. కొంతకాలం ఆక్టింగ్ మునసఫీ చేశాడు. అందువల్ల చిన్న మునసబు అని పేరుపొందాడు. గ్రామ వ్యవహారాల్లో అందరికి భయాందోళన కలిగించేవాడు. బాలకృష్ణమ్మగారికి ప్రత్యర్థి. శ్రీమంతురాజా మల్లికార్జున ప్రసాద్‌నాయుడు గారికి విశ్వాసపాత్రుడు. ఈయన తరచు చల్లపల్లిలోను బందరులోను ఉండేవాడు. బందరులోని ఆనాటి ప్రసిద్ధులయిన కోటవారు, కాకోవారు ఈయన మిత్రబృందం. తెల్లని పంచెలు ధరించి నల్లని కోటు వేసుకొని తిరిగేవాడు. ఆ కాలంలో ఈయన ఒక జమీందారో, గొప్ప ఉద్యోగస్తుడో అనే అంత హుందాగా ఉండేవాడు.
యెస్టేటులో బాలకృష్ణమ్మగారికి ఈయనకు ప్రతి గ్రామమందును పార్టీ అనుచరులుండేవారు. రామస్వామి గారిది చిన్న పార్టీ. చిన్న పార్టీవారందరు జమీందారుకు అనుకూలురు. అన్నగారితో ప్రత్యర్థిగా ఉన్నా అన్నగారిని ముద్దాయిగ పెట్టలేదు. ఎవరైనా ఆయనను ముద్దాయిగా పెట్టమంటే, ఆయనను పెట్టే అసలు కేసే పోతుందనేవాడు. అలాగే బాలకృష్ణమ్మగారూ తమ్ముడిని ముద్దాయిగా పెట్టలేదు. ఇద్దరు ఒకరియెడల ఒకరు అంత గౌరవం గలిగి వ్యవహరించేవారు.

ఆయన తెలివితేటలు అభిమానం ఆత్మగౌరవం కూడ తెలియతగినవి.

రాజాగారికి ఈయన ఒక నోటు వ్రాసెను. ఈయనకు తెలుపకుండానే ప్లెయింటు చేశారు. ఈయన ఎంత సంపాదించినా చేతిలో కాని నిలచేది కాదు. ఆ ఋణం ఎట్లా తీర్చగలడు? కనుక ఒక ఆలోచన చేశెను. రాజాగారు ఒంటరిగా ఉన్న సమయంలో తన బంగారపు గోవ మొలత్రాడు తీసి మీ బాకీ క్రింద జమకట్టుకోవలసిందని దానిని చేతికందించెను.

శ్రీమంతురాజా మల్లికార్జున ప్రసాద్‌నాయుడు గారు పుచ్చుకొని అటుఇటు త్రిప్పి డబ్బు వదిలిపెట్టలేక, ఆయనతో గల పరిచయంవల్ల దానిని తీసుకొనలేక కొంతసేపు తటపటాయించి తిరిగి రామస్వామిగారికి యిచ్చివేశెను.

జమీందారుగారికి అనుకూలంగా ఉన్నా ఆత్మగౌరవంతో ప్రవర్తించేవాడు.

ఆయన ఆత్మగౌరవమునకు పలుకుబడికి ఆనాటి జమీందారి కుటుంబపు మనస్తత్వమునకు ఒక ఘటన తెలిపెద.

ఆయన బందరులో అత్యధికంగా ఉండేవాడు. బందరులోని ప్రముఖులు, ప్లీడర్లు, ఉద్యోగులు అందరు ఆయనకు పరిచయులే.

బందరు పురమందిరంలో ఒకనాడొక సభ జరుగుచుండెను. ఆ మందిరమంతా కిటకిటలాడుచుండెను. రామస్వామిగారు అప్పటి జమీందారు మల్లికార్జున ప్రసాద్‌నాయుడు గారి తమ్ముడగు వెంకట్రామలింగన్న బహద్దర్‌గారు కూర్చున్న కుర్చీదగ్గర ఉన్న కుర్చీ ఖాళీగానుండుట చేత వెళ్ళి కూర్చుండెను. తన సరసను తన ఎస్టేటు రైతు కూర్చుండుట అవమానంగా భావించి అక్కడనుంచి లేచి ఖాళీ అయిన మరొక కుర్చీలో కూర్చుండెను.

ఆత్మగౌరవంగల రామస్వామి ఇది తనకు అవమానముగ భావించి దానికి ప్రతిక్రియ తలచి మిత్రులతో ఆలోచించెను. ఆ జమీందారుగారి తమ్ముడు తరచు జిల్లా సరస్తాదారగు కోకా నారాయణస్వామి గారింటికి వచ్చేవాడు. ఆయన రామస్వామిగారికి ప్రియమిత్రుడు. అందుచేత వారిద్దరు కలిసి ఆయనకు తిరిగి అవమానం చేయతలచి ఒక పన్నాగం పన్నారు. ఆయన ఒకనాడు సాయంకాలం రాగా తిరిగి మరుసటి దినము ఉదయం తొమ్మిదింటికి రమ్మనమని చెప్పెను. ఆ సమయానికే మిత్రుడు రామస్వామిని కూడ రమ్మనమనెను. ఆయన వచ్చేసరికి తనకొక కుర్చీ, ఆయనకొక కుర్చీ ఉంచి మిగతావి తీసివేయించెను. ఆయన రాగానే కుర్చీలో కూర్చొనమని మాట్లాడుచుండగా రామస్వామి వచ్చెను. ఏమి ఎరుగనట్లు ఆయన గౌరవార్థం సిరస్తాదారు లేవగా ఆయనతో పనిఉండి వచ్చిన ఆ వెంకట్రామన్న బహద్దర్ నిలబడ్డాడు. రామస్వామికి కుర్చీ వచ్చేవరకును ఇద్దరూ నిలబడే ఉండిరి. అప్పుడు కుర్చీ తెప్పించి రామస్వామిని కూర్చుండపెట్టి తాను కూర్చున్న తరువాత ఆయన కూర్చున్నాడు. ఇటువంటివి రామస్వామి రాజసపు పనులనేకం కలవు.

తన అన్నగారు జలధీశ్వరస్వామికి పవళింపు సేవకు మేడ కట్టించెను. ఈయన సుబ్రహ్మణ్యస్వామికి గోపురం కట్టించెను.

తన కుమార్డు కృష్ణయ్య ఏజోక్యం లేకుండా వ్యవసాయం చేసుకొనుట చూచి దారేపోయేవాడిని నాలుగు తిట్టయినా పలానావారి కుమార్డు అనిపించేటట్లు కనబడటంలేదని అనేవాడట. కృష్ణయ్య ఏ వ్యవహారమూ పట్టించుకోక తనపనేమో తానేమోనన్నట్లుగా ఉండేవాడు. ఈయనకు రామస్వామి కలిగెను. తాతగారి ఆలోచనలు ఆయనలో లేకపోలేదు. యీ రామస్వామిగార్కి వెంకటేశ్వర్లు, కోటయ్య, వెంకటకృష్ణారావు అను కుమారులు కలరు.

వెంకయ్యగారి ఐదవ కుమార్డు మాధవరాయుడు. ఆయన ప్రతిభావంతుడు, మంచి పట్టుదల గలవాడు, మంచి వ్యవహర్త. భారతం బాగా అభిమానంగా చదివినవాడు. ఈ దేవరకోట (చల్లపల్లి) ఎస్టేటులో తుమ్మచెట్లు మినహా మిగతా చెట్లన్నీ జమీందారువే. ఎవరైనా ఏదైనా చెట్టు కొట్టే క్రిమినల్ కేసు పెట్టేవారు. ఇటువంటి దశలో మాధవరాయుడు రాజాగార్కి కొరకరాని కొయ్య అయ్యెను. ఆయన తన భూమిలోని తాటిచెట్లు వ్యవసాయానికి ఇబ్బందిగా ఉన్నవని నోటీసు ఇచ్చి కొట్టివేయించెను. అందుచేత జమీందారు ఆయనపైన ఎటువంటి చర్య తీసుకొనుటకు ఏమీ తోచక మిన్నకుండెను. ఏదైనా వ్యవహరిస్తే ఎదురు వ్యవహరించి యెస్టేటు తగాదా తెస్తారనే భయంతో శ్రీమంతురాజా మల్లికార్జున ప్రసాద్‌నాయుడు గారు ఏమీ చేయలేదు. ఘంటశాలతో తగాదా పెట్టుకొంటే వారు పరగణా తగాదా చేస్తారని అంటూ ఉండేవాడు. బాలకృష్ణమ్మ, ఆయన సోదరుల ప్రతిభ, ప్రవర్తన కొంతవరకు తెలిసెనుగద. వారు అఖండ ప్రతిభావంతులు. ఈ మాధవరాయుడు గార్కి సంతానము లేదు. రామస్వామిగారి కుమార్డు బసవయ్య గార్ని దత్తత తీసుకొనెను. బసవయ్య చాలా యోగ్యుడు. గొట్టిపాటివారి వనంతోటను ఈయన అందరికి పంచినాడు. వీరికి కుటుంబరావు, మాధవరావు అను కుమార్లు గలరు.

చెంచయ్యగారి నాల్గవ కుమారుడు నరసన్న. ఈయన దత్తపుత్రుడు పట్టయ్య పొట్టిగా వుండేవాడు. భక్తుడు. ఈయనకు వెంకటకృష్ణయ్య, గోపాలుడు ఇద్దరు కుమాళ్లు. వీరిద్దరికి పురుష సంతానం లేదు. చెంచయ్యగారి ఐదవ కుమార్డు రామన్న. ఈ రామన్నగార్కి నరసన్న, గోపాలుడు, సుబ్బయ్య, గంగాధరుడు, వెంకన్న అను ఐదుగురు కుమాళ్లు. గోపాలుడు, సుబ్బయ్య నిస్సంతువుగా పోయారు. సుబ్బయ్య రామస్వామి పార్టీలో ప్రముఖుడు, అగ్గిరాముడని ప్రతీతి. నరసన్నగార్కి సుబ్బన్న, కృష్ణయ్య అనే కుమారులు గలరు. సుబ్బన్నకు రామయ్య, లక్ష్మీనారాయణ, గోపాలుడు అను ముగ్గురు కుమార్లు గలరు. రామయ్య పెండ్లి కాకముందే పోయెను. లక్ష్మీనారాయణ అనేక వ్యాపారాలు చేసిన అనుభవశాలి. మంచి వ్యవసాయకుడు. ఈయనకు వెంకటనరసింహారావు అను కుమార్డు గలడు.

గంగాధరుడు మంచి వ్యవసాయకుడు. ఎర్రగా బొద్దుగా ఉండేవాడు. ఈయనకు రత్తయ్య, సుబ్రహ్మణ్యం అను కుమాళ్లు. సుబ్రహ్మణ్యంగార్కి వెంకటనారాయణ, రామబ్రహ్మం అను ఇద్దరు కుమార్లు గలరు. రామబ్రహ్మం చల్లపల్లి మునిసిఫీ చేయుచున్నాడు.

రామన్నగారి ఐదవ పుత్రుడు వెంకన్నకు పురుష సంతానం లేదు. ఈయన ఈ కుటుంబంలో ప్రముఖుడు, తెలివైనవాడు.

గుఱవయ్యగారి మూడవ కుమారుడు వెంకటనారాయణ. ఈయనకు సీతయ్య కలిగాడు. సీతయ్యకు పట్టయ్య. ఈ పట్టయ్యకు శ్రీరాములు. వీరినిగురించి ఏమీ తెలియదు.

గుఱవయ్య నాల్గవ కుమార్డు వెంకట్రామయ్య. ఈయన కుమార్డు సుబ్బయ్య. వీరిద్దరి గురిచి ఏమీ తెలియదు. సుబ్బయ్యగారి కుమారుడు. బాపయ్య. ఈయన బాల్యంలోనే తండ్రి సుబ్బయ్యగారు గతించారు. ఈయన భార్య రంగమ్మ ఘంటశాలలోని వేమూరివారి ఆడబడుచు. మొగదిక్కులేక తన తమ్ముడు వేమూరి సుబ్బయ్యను వ్యవసాయం చేయించగలందుకు తీసుకువచ్చింది. బాపయ్య పెద్దవాడైనప్పటికి ఆయన్ని నిలుపుకున్నది.

ఆ కాలంలో "టపా" బళ్ళమీద అంచెలగా వెళ్లేది. ఆ టపా నడిపించే కంట్రాక్టు ఈ బాపయ్యగారు తీసుకున్నారు. ఆ బళ్ళు కట్టేవారివద్ద గుమ్మడి గింజలు తీసుకొనేవాడట. ఆ కంట్రాక్టుదారు కొంతసొమ్ము సంపాదించాడు. అప్పట్లో ఈ ప్రాంతమంతా మెరకసాగె. కైకలూరు తాలూకాలో పల్లెవాడలో అప్పటికి పల్లపుసాగు అగుతూ ఉండటంవల్ల అక్కడనుంచి ధాన్యం తెచ్చి ఇక్కడ అమ్ముతూ ఉండేవాడు. ఈయన కొన్ని కొట్లు కూడ కట్టించాడు ధాన్యం నిలవపోయుటకు. అక్కడ వారు ఈయనకు సహాయం చేస్తూ ఉండేవారు. ఆ ప్రాంతాలలో బాపయ్యగారు అప్పులుపెట్టూ ఉండేవాడు. అక్కడ జట్టావారి కుటుంబంతో స్నేహం అయింది.

వేమూరి సుబ్బయ్యగారికి పుల్లయ్య అనే కుమారుడు కలిగాడు. బాపయ్యగారికి బ్రహ్మన్న జన్మించాడు. వారిద్దరూ కలిసియుండుటవల్ల పుల్లయ్య బ్రహ్మన్నగారు అనేవారు. వారిద్దరు మేనత్తమేనమామ బిడ్డలు. సిరిసంపదలుగల మోతుబరి రైతులు. గ్రామంలో కమ్మవారిలోకల్లా ధనవంతులు. బ్రహ్మన్నగారు మేనల్లుడైన పుల్లయ్యగారికి క్రమమైన వాటా పంచిపెట్టాడు. వారిద్దరూ చెరి 70 యకరాలు పంచుకున్నారు. తండ్రి అనంతరం బ్రహ్మన్నగారు కూడ వ్యాపారం చేస్తూ ఉండేవాడు. ఆయన నల్లనివాడే. చామపువ్వు కడియం ఉండేది. గ్రామ వ్యవహారాల్లో జోక్యం కలిగించుకొనక తనపని తాను చూచుకొనేవాడు.

ఆయన వల్లెవాడ వెళ్ళుటకు గుఱ్ఱం ఉండేది. అప్పట్లో పెద్దవారందరికి గుర్రాలుండేవి. ఈయన అక్కడకు వెళ్ళినప్పుడు గుఱ్ఱం వేయుటకు చెలికలుండేవి. గొట్టిపాటివారి చెలికలని పేరుండేది. వల్లెవాడలో బ్రహ్మన్నగారొక చెరువుకూడ త్రవ్వించారు. గొట్టిపాటివారి చెరువు అని దానికి పేరు. బ్రహ్మన్నగారికి పిశుపాటి పుట్టంబొట్టు గుమాస్తా. ఆయన వారి పౌరోహితుడు కూడ.

బ్రహ్మన్నగారు దాతగా ఖ్యాతిగాంచాడు. పుట్టంబొట్టుకు తన చేను మధ్యన రెండెకరాలు దానం చేశాడు.

వేమూరి ఘంటయ్యగారికి ఈయన అల్లుడైనందున వారి విశ్వేశ్వరాలయానికి మూడుకుంటల భూమి దానం చేశాడు. ఆ దేవాలయం తిరిగి కట్టేటప్పుడు ఒక జత ఎడ్లను దేవాలయపు పనికి ఉ

ంచాడు.
ఆయన ఒక మామిడి తోట, తాళ్ళతోట కూడ వేయించాడు. వేమూరివారి తోటలో ఒక సత్రం కూడ కట్టించాడు.
విశ్వేశ్వరాలయం దగ్గరగానున్న రామాలయం బ్రహ్మన్నగారే కట్టించారు. బ్రహ్మన్నగారికి వెంకయ్య, వెంకటరత్నం, వెంకట్రామయ్య అను నలుగురు కుమాళ్లు. పెద్దవారు నల్లనివారైనా దీర్ఘకాయులు. మంచిబలం కలవారు. చిన్నవారిద్దరు ఎర్రగా ఒకేమాదిరిని ఉండేవారు. అందరూ ప్రజోపయోగకరమైన పనులు చేసినవారే. వారు 18 ఎకరాల చొప్పున పంచుకున్నారు. వెంకయ్యగారు నలుపైనా ఉన్నతాకారం గలిగిన గంభీరమూర్తి. ఆయన పెద్దగానే పుట్టాడు. అన్నివిధాల ఆయన పెద్దగానే గణుతింప బడ్డాడు. ఘంటశాల గ్రామ పెత్తనదార్లలో వెంకయ్యద్వయం వగైరా అందరిలోకి ఆయనే పెద్ద. ఆయన ఒక నిర్ణయానికి వచ్చిన పిమ్మట బ్రహ్మ చెప్పినా మారేవాడు కాదు. లాభనష్టాలను చూచేవాడు కాడు. ఆధ్యాత్మిక చింతనకలిగి కొంత వైరాగ్యాన్నిఇ పెంచుకొన్నాడు. కొంతకాలం సన్యాసులవెంట, బైరాగులవెంట తిరిగాడు. తర్వాత అది ప్రయోజనం లేదనుకొని స్వయంగానే జ్ఞానార్జనకు గడంగాడు. అచలయోగమందు ఆయనకు అభిమానం అధికం. వేమన పద్యాలన్నీ ఆయనకు కంఠస్థం. తత్వజ్ఞాన గ్రంథాలను అధికంగా పఠిస్తూ ఉండేవాడు.
వార్తాపత్రికలను చదువుతూ ఉండేవాడు. ఆ కాలపు పెత్తందార్లలో జాతీయాభిమానం అధికంగా కలవాడు. ఆయనను పెత్తందారు అనటం అనుచితం. పెత్తందార్ల పెత్తనం పోగొట్టాలనే ప్రజాస్వామ్యవాది. ఒకరిని స్తుతించటం, ఒకరికి లొంగటం, ఒకరిని కుంగతీయటం ఇష్టంలేని ప్రజాస్వామ్యవాడి. కాంగ్రెసు సంస్థ యందఖండ భక్తి గలవాడు. నిత్య ఖద్దరుధారి.
1918లో ప్రథమ ప్రపంచ సంగ్రామకాలంలో దివితాలూకా తహశీల్‌దార్ హుమాయూన్ సాహేబుగారు (తర్వాత కలక్టరు కూడ అయ్యారు) యుద్ధచందాల కొరకు (వార్ ఫండ్) ఘంటశాల రాగా మా గ్రామస్తులు బీదవారు చందాలివ్వలేరని ఖచ్చితంగా చెప్పిన మహామహుడు. నేను ఇల్లు ఇల్లు తిరిగి వసూలు చేస్తాను అని ఆయన అంటే గ్రామ పెద్దలను కాదని మీరు వసూలు చేయగలరా అని నిర్భయంగా చెప్పిన ధీశాలి. అక్కడనే తన వెంటనున్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరుతో తహశీల్‌దారు ఏకాంతముగ మాట్లాడాడు. బహుశా ఆయనను అరెష్టు చేయమని అంటే ఆ ఇన్‌స్పెక్టరు అంత మంచి పని కాదని ఉండవచ్చును. అంతట వారు సంభాషణ మార్చి మరొకసారి చూస్తామని వెళ్ళిపోయారు.
1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెసుకు గ్రామ కాంగ్రెసు యువకులతో వెళ్లాడు. గ్రామ పంచాయతీ బోర్డులో ఆయన సభ్యుడుగా ఉండి చేసిన సేవ కొనియాడ తగినది. గ్రామములోని బజారులలో మట్టి కొట్టుకు పోకుండా అడ్డకట్టలు వేయించి బజారులలోను, పెద్ద దేవాలయము ముందు మట్టి తోలించుటకు ఆయనే కారకుడు. అప్పుడు నల్లమట్టి తోలుటవల్ల కొందరు ఆ బురదబాధకు దూషించినా ఏమి అనుకొనేవాడు కాదు. ఆయనను ఇంజనీయరు అనేవారు కొందరు. ఆవిధంగా బజారులలో మట్టి పోకుండానేగాక, వీధులను మెరకచేసి శాశ్వత ప్రయోజనం కలుగచేశాడు.

గ్రామ సంఘానికి కొంతకాలం అధ్యక్షుడుగా నుండి, పెత్తనదార్ల దగ్గరనున్న సొమ్మంతా వసూలుచేసి గ్రామ చావిడి కట్టించాడు. దానిలో కొంతకాలం బాలికా పాఠశాల ఉంచటం, తర్వాత దానిని అమ్మి జలధీశ్వర ఆలయం ముందు డాబా కట్టించడం జరిగింది.

ఆయన కారుణ్య స్వభావానికి ఒక సంగతి తెలియ చేస్తాను. శ్మశానంలోని పుట్టలు వగైరా తీయించితే మేత బాగా పట్టుందని గొట్టిపాటి బ్రహ్మయ్య అనగా రైతులంతా చేలల్లో పుట్టలు తీసివేసిరి. జీవకోటికి అందలేకుండా చేస్తుంటే, ఈ స్మశానంలోకూడ ఆ జంతువులను బ్రతకనియ్యకపోతే యెట్లా అన్న భూతదయాపరుడు. గౌతమబుద్ధుని కరుణ, మహాత్ముని అహింసా దృష్టి ఆయనలో మూర్తీభవించ లేదనుకొన గలమా?

1921లో మహాత్ముని అసహాయోద్యమము ఈ గ్రామంలో అధికంగా ఆచరణలోకి వచ్చెను. అందుచేత కోర్టు బహిష్కరణ చేస్తూ గ్రామ వ్యవహారాలన్నీ బైటకు పోకుండా గ్రామంలోనే పరిష్కారం చేసుకొనుటకు ది 12-12-1921 తేదీన ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకొనడమైనది. ఈ పద్ధతి బహుకాలం సాగింది. ఈ కేసుల సందర్భంలో ఒక్కొక్కపుడు కొంత డిపాజిట్టు చేసుకోవలసి వచ్చేది, ఆ డబ్బంతా ఆయన భద్రంగా సీళ్లు వేసి తనవద్ద ఉంచేవారు.

ఈ గ్రామ పంచాయతీ బాగుగ పని చేయుచుండుటచే పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరు వెంకటప్పయ్య నాయుడుగారు 1923లో చల్లపల్లి క్యాంపునకు ఈ వెంకయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్యగార్లను రప్పించుకొని మీరు క్రిమినలు కేసులు రాకుండా చేస్తున్నారట, మీ పంచాయతీ కోర్టు యెక్కడ, ఏమిటి అని ప్రశ్నించగా మా వ్యవహారములన్నీ చెట్లక్రిందనే, క్రిమినలు కేసులో సవిలు కేసులో మేము తగాదాలు తీర్చుకొనుచున్నాము, ఇది తప్పా? అని వారు చెప్పగావిని అంతట వారిని పంపెను.

గ్రామం పెద్దది. ఊరుమధ్య మంచినీళ్లు లేవు. మంచి నీళ్ళు తెచ్చుకోవటం ఒక పూట పని. అందువల్ల గ్రామ మధ్యనున్న దక్షిణ నూతిలో మంచినీళ్లు పడునేమో అని పంచాయతీబోర్డు ద్వారా పంపింగు సెట్ తెప్పించి బ్రహ్మాండమైన ప్రయత్నం చేశాడు. కాని మంచినీరు పడలేదు. తర్వాత మూడు మైళ్లలో వున్న కలవనుండి మంచినీళ్ళ కాల్వద్వారా చెరువులకు నింపాలని ప్రయత్నం చేశారు. తగినంత ద్రవ్యం వనకూడే వనరు లేనందున ఆ పని సాగలేదు. ఇట్లా నిస్స్వార్థంతో గ్రామాభివృద్ధికి పాటుపడిన గ్రామోపకారి. ప్రథమ ఘోటకసంఘానికి, పంచాయతీకి ఈయనే అధ్యక్షుడు. ఈయన ఆ విచారణ సమయమందు తెల్లని లాగు చొక్కా ధరించి విచారించేవాడని అనేవారు. ఈయన 1930లో చనిపోయారు. జీవించినంతకాలం గ్రామశ్రేయానికి పాటుపడ్డ ప్రజాస్వామ్యవాది.

ఈయనకు వెంకటేశ్లర్లు, వీరరాఘవయ్య లను కుమార్లు గలరు. వెంకటేశ్వర్లుగారు విద్యార్థి దశలో నాయకుడు, ఇంటరు చదువుతూనే నాగపూరులో చనిపోవుట (ది 30-8-1916) గ్రామానికి, దేశానికి నష్టమే.

వెంకటేశ్వర్లు దేశాభిమాని. ఆయన వంగదేశ విభజన అనంతరం కలిగిన జాతీయోద్యమం బాగా గ్రహించినవాడు, అందువల్ల స్వదేశ వస్త్రములు, విద్య, సాంఘిక, రాజకీయ కార్యములందు

పనిచేయుచుండెను. బందరులో చదువుచుండగా కమ్మ విద్యార్థి సంఘానికి కార్యదర్శి. మంచి విద్యాభిమాని. ఈ గ్రామమునుండి, ఇతర గ్రామాలనుండి అనేకులను ప్రోత్సహించి ఆంగ్ల విద్యాభ్యాసములనకు బందరు తీసుకువెళ్ళెను. అప్పట్లో 1914 ప్రాంతాల ఈ గ్రామంలో 20 మంది విద్యార్థులు ఆయన ప్రోత్సాహంమీద బందరులో చదువుచుండిరి. వీరందరకు ఆయన సంరక్షకుడుగా నుండి విద్య, ఆరోగ్య విషయములను చూచుటేగాక సరైన భోజనవసతికిగాను ఒక హాస్టలును స్థాపించెను. మంచి ఉత్సాహము, పట్టుదల కలిగి సంఘసేవ, దేశసేవ, గ్రామ సేవ చేసిన ఆదర్శ యువకుడు. ఆయనవల్ల, ఈ గ్రామమున 28-9-1914 తారీఖున శ్రీరామమోహన గ్రంథాలయం స్థాపింపబడింది.

ఆయన ఉత్సాహ, ప్రోత్సాహ, సాహచర్యముల వల్లనే ఈ గ్రామంలోని యువకులగు గొట్టిపాటి బ్రహ్మయ్య మొదలగువారు దేశ సేవానురక్తులగుట.

ఈయన మరణానికి చింతిస్తూ రైతుబాంధవుడు కానూరి వెంకట చలపతయ్యగారు కృష్ణాపత్రికలో ఆదర్శ సేవకుడగు ఒక విద్యార్థి అస్తమయం అనే శీర్షికతో ఆయన గుణగణములను ప్రశంసిస్తూ ఒక వ్యాసమును ప్రచురించెను. దేశభక్తుడు, చిరయశస్సుగాంచిన మాగంటి బాపినీడు, వెంకటేశ్వర్లుగారు సహాధ్యాయులు. ఆయన, ఈయన సంగ్రహచరిత్ర ఈయన ప్రథమవార్షికోత్సవానికి వ్రాసిపంపెను. అభివృద్ధికి రాతగిన వెంకటేశ్వర్లు అస్తమించుట ఈ గ్రామానికి గొప్ప నష్టదాయకము.

వెంకయ్యగారి రెండవ కుమార్డు వీరరాఘవయ్యగార్కి వెంకటేశ్వర్లు, వెంకటకృష్ణయ్య అను కుమారులు గలరు.

బ్రహ్మన్నగారి రెండవ కుమార్డు అప్పయ్యగారు మంచి ఆర్జనపరుడుగా ప్రసిద్ధి. మంచి వ్యవహారదక్షుడు. గ్రామంలో స్నేహితులు, బంధువులు గృహనిర్మాణము చేయదలిస్తే ప్లాను వేసినది లగాయతు ఆ ఇల్లు పూర్తి అయ్యేవరకు ఆయన తన స్వంతపనిగా భావించి అక్కడే మకాం పెట్టి మితవ్యయంతో పూర్తి చేయించేవాడు. రామమోహన గ్రంథాలయం ప్రథమంలో వారింటివద్దనే పెట్టుట జరిగింది. దానికి చాలకాలం ఆయన ట్రస్టి. దానికి ప్రథమంలో ఒక బీరువా, గ్రామంలో డబ్బు సంపాదించి ఇచ్చారు. కీ॥శే॥ వెంకటేశ్వర్లుగారి పేర వెంకటేశ్వర సత్రం కట్టించారు మంచి ఆర్థికవేత్త.

ఈయన కుమార్డు వెంకటసుబ్బయ్యగారు ప్రసిద్ధుడు. ఈయన, ఈయన భార్య సరస్వతమ్మ జైలుకు వెళ్లిరి. ఈయన 1920లో అనగా పదునేడవయేటనే పూజ్య బాపూజీ యాదేశమును శిరసావహించి భారత స్వాతంత్ర్య సమరమున సైనికుడుగా జేరి తదాది స్వార్థచింత పదవీకాంక్షగాని, నేతృత్వాభిలాషగాని లేక, పీడిత ప్రజాసేమమే యేకైక లక్ష్యంగా నిడుకొని వారు చేసిన పనులు అనేకములు గలవు.

రాత్రింబవళ్లు కష్టించి, గిట్టుబాటైన ధరలేక అలమటించే పేద రైతాంగం గోడును ప్రభుత్వ దృష్టికి తెచ్చి ధాన్యం ధర పెంచుటకు, ధాన్య సేకరణలో అక్రమాలు తొలగించుటకు, మిల్లర్ల మాటలకు చెవియొగ్గి బస్తా 1కి రు 0-75 పైసలు ప్రభుత్వం తగ్గించినప్పుడు ఆ డబ్బును ముదరా యిప్పించుటలో కృషిచేసి విజయము పొందెను.

మురుగు సాగునీటి సౌకర్యములు కలిగించుటకు, మైనరు ప్రాజెక్టుల విషయంలో, చెరుకు ఉత్పత్తిదారులకు

గిట్టుబాటు ధర ఇప్పించుటలోను అవిరామంగా కృషి సల్పిరి. ది 22-12-1949న వార్ధాలో సర్వోదయ సంఘసమావేశమునకు వెళ్ళిరి.

వీరు కృష్ణాజిల్లా బోర్డు వైస్ ప్రసిడెంటుగాను, ఆంధ్రప్రదేశ్ స్వతంత్ర పార్టీ అధ్యక్షులుగాను, "వాహిని" సంపాదకులుగాను పని చేసిరి. "భారత రైతునేత" ఆచార్య రంగాగారి అనుచరుడుగా, కిసాన్ కాంగ్రెసు అధ్యక్షుడుగా 1943 నుంచి ప్రసిద్ధి గాంచారు. వీరు ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ ప్రముఖులలో ఒకరు. వీరికి వెంకటకుటుంబరావు అను కుమార్డు గలడు.

బ్రహ్మన్నగారి మూడవ కుమార్డు వెంకటరత్నంగారు అందమైనవాడు. బంగారు మురుగులు, వేళ్ళ ఉంగరాలు, మొలలో తాళంచేతులతో, వెండిగొలుసు, కిర్రు చెప్పులు, ఆల్పేకకోటు, తలగట్టు ఈయన అలంకారాలు. ఈయన బందరులోను బెజవాడలోను ఖాయిదా ధాన్యం వ్యాపారం చేశాడు. అనేకచోట్ల పొలాలు కొని అమ్మాడు. చాలా ఉదారుడు. వేలాది సంపాదించాడు. ఖర్చు పెట్టాడు. మంచి విద్యాభిమాని. గ్రామంలోని పాఠశాలలో బాగా చదువుకున్న పిల్లలకు బహుమతులు ఇస్తూ ఉండేవవాడు. బందరులో ఇంగ్లీషు చదువుకొనే ఈ గ్రామ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉండేవాడు. 1930లో ఈ గ్రామములో జరిగిన తాలూకా సభకు అధిక మొత్తం ఇచ్చి ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా ఖ్యాతిగాంచాడు. ఈయనకు బాపయ్య, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ అను ముగ్గురు కుమార్లు. బాపయ్యగారు బాల్యంలోనే పోయెను. వెంకటేశ్వర్లు, పంచాయతీ బోర్డు మెంబరుగా కొంతకాలం పనిచేసెను. బ్రహ్మన్నగారి నాల్గవ కుమార్డు వెంకట్రామయ్యగారు. ఈయన బహుకాలం జాయింటుగానే ఉండిరి. మంచి వ్యవసాయకుడు. అన్నగారు కొన్న భూములను మరమ్మతు చేయించి వ్యవసాయం చేయించేవాడు.

గ్రామంలో చాలా శ్రమపడి చందాలు వేయించి జలధీశ్వరస్వామి ధ్వజ స్తంభానికి ఇత్తడి రేకు వేయించాడు. అట్లాగే పాడైపడిపోతూవున్న, గ్రామంమధ్య అసహ్యంగానున్న పెన్నేరమ్మగుడిని బాగుచేయించి చక్కగా సిమ్మెంటు చేయించాడు.

ఈ గ్రామంలో గాంధీ హైస్కూలు భవనం గ్రామత్యానే కంట్రాక్టు తీసుకొని, భద్రంగా కట్టించుట జరిగింది. ఈయన నిత్యము వచ్చి అక్కడ కూలీల చేత పని చేయించాడు.

ఈ ముగ్గురు అన్నదమ్ములు అన్నగారగు వెంకయ్యగారి యందు అచంచల భక్తి విశ్వాసములు గలవారు. శ్రీరాముని తమ్ములవలె సంచరించి చరితార్థులయ్యారు. ఈ వెంకట్రామయ్యగార్కి బ్రహ్మయ్య, వెంకటరత్నం, దయాకరుడు అను ముగ్గురు కుమార్లు. బ్రహ్మయ్యగారు స్కూలు మాస్టరుగా చాలాకాలం చేశారు. మాష్టరు బ్రహ్మయ్య అని ప్రసిద్ధి. పంచాయతీ బోర్డు వైస్ ప్రసిడెంటుగా కొంతకాలం చేశారు.

ఈయనకు వెంకటకృష్ణయ్య, అప్పయ్య, రామారావు, రాజబాబు, వెంకట్రామయ్య అను కుమార్లు గలరు. వెంకటరత్నంగారు వ్యవసాయకుడు. వీరికి బాపినీడు అను కుమారుడు గలడు.

దయాకరుడుగారు కొంతకాలం పంచాయతీ బోర్డు వైస్ప్రసిడెంటుగా చేసెను. ప్రస్తుతం పంచాయతీబోర్డు మెంబరు. పశుపోషణయందు మంచి అభిమానం గలదు. వీరు మేపిన పశువులు పశుప్రదర్శనములో బహుమతులు పొందినవి. ఆచార్య రంగాగారియందు, చల్లపల్లి రాజాగారియందు అభిమానము గలవాడు. గ్రామములో ఒక ప్రముఖుడు.